మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం MONDAY 2-2-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 214 Issue: 214

02 ఫిబ్రవరి 2026 - సోమవారం, శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం - శిశిర ఋతువు, మాఘ మాసం - కృష్ణపక్షం, సూర్యోదయం - ఉ. 6:51, సూర్యాస్తమయం - సా. 6:08, తిథి, పాడ్యమి రా. 1:55ం వరకు, తరువాత విదియ, సంస్కృత వారం, ఇందు వాసరః, నక్షత్రం, ఆశ్లేష రా. 10:48 వరకు, తరువాత మఖ, యోగం, ఆయుష్మాన్ ఉ. 7:19 వరకు, కరణం, భాలవ మ. 2:46 వరకు, కౌలవ రా. 1:55ం వరకు, వర్జ్యం, మ. 12:08 నుండి మ. 1:39 వరకు, దుర్ముహూర్తం, మ. 12:52 నుండి మ. 1:37 వరకు, మ. 3:07 నుండి మ. 3:52 వరకు, రాహుకాలం, ఉ. 8:16 నుండి ఉ. 9:40 వరకు, యమగండం, ఉ. 11:05 నుండి మ. 12:29 వరకు, గుళికాకాలం, మ. 1:54 నుండి మ. 3:19 వరకు, బ్రహ్మముహూర్తం, తె. 5:15 నుండి ఉ. 6:03 వరకు, అమృత ఘడియలు, రా. 9:15 నుండి రా. 10:46 వరకు, అభిజిత్ ముహూర్తం, మ. 12:07 నుండి మ. 12:52 వరకు, గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Published From Jagitial
www.evarthalu.com




# బడ్జెట్ 2026-27

(ప్రశ్నలు.. జవాబులు)

ప్రతి ఏడాది బడ్జెట్ వచ్చిన తర్వాత ప్రజలలో ఒకే ప్రశ్న ఉంటుంది. ఇది మనకు ఉపయోగమా? మన జీవితంలో ఏమి మారుతుంది? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. మరి బడ్జెట్ వల్ల మనకు లాభాలేంటి? నష్టాలేంటి? అన్నది తెలుసుకోవడం అవశ్యం. ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ పీ.మణిశంకర్ 'ఈవార్తలు' పాఠకుల కోసం ప్రత్యేకంగా పలు సందేహాలను నివృత్తి చేశారు.

(.. పూర్తి సమాచారం మూడో పేజీలో..)





# రైతు.. రక్షణ

## ఆపరేషన్ సిందూర్ ఎఫెక్ట్



**రక్షణ రంగానికి భారీగా నిధులు**

- ఆ శాఖకు 7.85 లక్షల కోట్లు
- ఎరువుల సబ్సిడీకి 1.7 లక్షల కోట్లు
- వ్యవసాయానికి రూ.1.4 లక్షల కోట్లు
- మౌలిక సదుపాయాలకూ పెద్దపీట

**మొత్తం బడ్జెట్ 53,47,315 లక్షల కోట్లు**

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తిస్థాయి బడ్జెట్‌ను ఆదివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. యువశక్తిని చోదకశక్తిగా చేసుకుని, పేదలు, అణగారిన వర్గాల ప్రగతి లక్ష్యంగా ఈ బడ్జెట్‌ను రూపొందించినట్లు ఆమె తెలిపారు. మొత్తం రూ.53.5 లక్షల కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన ఈ బడ్జెట్‌లో స్థిరమైన ఆర్థిక వృద్ధి, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం, 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్' దార్శనికతతో అందరికీ సమాన అవకాశాలు కల్పించడం అనే మూడు ప్రధాన కర్తవ్యాలకు ప్రాధాన్యం ఇచ్చారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో మొత్తం వ్యయం రూ.53.5 లక్షల కోట్లుగా అంచనా వేయగా, మొత్తం రాబడులు (అప్పులు మినహా) రూ.36.5 లక్షల కోట్లుగా ఉంటాయని బడ్జెట్‌లో పేర్కొన్నారు. కేంద్ర నికర పన్ను రాబడులు రూ.28.7 లక్షల కోట్లుగా అంచనా వేశారు. ద్రవ్యలోటును జీడీపీలో 4.3 శాతానికి పరిమితం చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. 2025-26 సవరించిన అంచనాల్లో ద్రవ్యలోటు 4.4 శాతంగా ఉంది. స్థూల మార్కెట్ రుణాలు



రూ.17.2 లక్షల కోట్లుగా ఉంటాయని తెలిపారు. దేశంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో పెద్ద పీట వేసింది. ప్రభుత్వ మూలధన వ్యయాన్ని (పబ్లిక్ క్యాపెక్స్) గత ఏడాది రూ.11.2 లక్షల కోట్ల నుంచి ఈసారి రూ.12.2 లక్షల కోట్లకు పెంచుతున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఈ భారీ

- తరువాయి 2 వ పేజీలో...

**బయోఫార్మాకు రూ.10,000 కోట్లు**

ఆరోగ్య శాఖకు 10% అధిక నిధులు

**రైతుల బడ్జెట్** › 5

- అధిక దిగుబడి పంటలకు ప్రోత్సాహం
- కొబ్బరి ఉత్పత్తి పెంపునకు ప్రత్యేక తోడ్పాటు
- 500 రిజర్వాయర్లలో చేపల పెంపకానికి నిర్ణయం
- పశు సంవర్ధక శాఖకూ భారీ ప్రోత్సాహకాలు

**5 రాష్ట్రాల్లో రేర్ ఎర్త్ మినరల్స్ పథకం**

- ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లు › 3
- ఆదాయపు పన్నుపై దక్కని ఊరట
- జిల్లాకో గర్ల్స్ హాస్టల్

**సిగరెట్లు, పాన్ మసాలా ప్రియం**

## ధరలు తగ్గేవి, పెరిగేవి ఇవే!




**ధరలు తగ్గేవి:**

- క్యాన్సర్ రోగుల కోసం 17 రకాల మందులు
- ఇళ్లలో వాడే మైక్రోవేవ్ ఓవెన్లు
- టీవీ గ్లాస్ ఉత్పత్తులు, ఆప్టికల్ గ్లాస్
- మొబైల్స్, ల్యాప్‌టాప్‌లలో వాడే లిథియం బ్యాటరీ
- ఎలక్ట్రిక్, సీఎన్‌జీ వాహనాలు
- విదేశీ టెక్నాలజీతో తయారయ్యే బూట్లు
- దేశీయంగా విమానాలు, రక్షణ పరికరాల తయారీకి వాడే విడిభాగాలు
- సెమీకండక్టర్లు, సెల్‌ఫోన్ చిప్స్
- విదేశాల నుండి తెప్పించుకునే వస్తువులు
- దుస్తులు, తోలు వస్తువుల తయారీకి వాడే ముడిపదార్థాలు

**ధరలు పెరిగేవి:**

- పారిశ్రామిక అవసరాలకు ఉపయోగించే ఖనిజాలు
- పాత ఇనుము లేదా ఇతర లోహాల తుక్కు (స్క్రాప్)
- మద్యం ధరలు
- స్టాక్ మార్కెట్ లేదా కమోడిటీ మార్కెట్‌లో చేసే 'ఫ్యూచర్స్ ట్రేడింగ్'
- విలాసవంతమైన వాచ్‌లు, ఆల్కహాల్, సిగరెట్లు, బీడీలు, పాన్ మసాలా, గుట్కా
- కాఫీ రోస్టింగ్, వెండింగ్ యంత్రాలు
- అమోనియం ఫాస్ఫేట్, అమోనియం నైట్రో ఫాస్ఫేట్
- చిత్రీకరణకు వాడే పరికరాలు, కెమెరాలు



**గద్దర్ అవార్డుల దరఖాస్తులకు గడువు పొడిగింపు** › 2

# 4.50 గంటలు

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ విచారణ

### ఆడియో, వీడియో రికార్డింగ్, వాంగ్మూలం నమోదు

### విచారణ అనంతరం శ్రేణులకు కేసీఆర్ అభివాదం

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విచారణ ముగిసింది. ఆదివారం నందినగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్), కేసీఆర్‌ను దాదాపు 4 గంటల 50 నిమిషాల పాటు విచారించింది.

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఈవార్తలు): విచారణ అనంతరం ఆయన వాంగ్మూలాన్ని అధికారులు నమోదు చేసుకున్నారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన నిందితులు ఇచ్చిన సమాచారం, వాంగ్మూలాల ఆధారంగా సిట్ అధికారులు కేసీఆర్‌పై ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. మొత్తం విచారణ ప్రక్రియను సిట్ అధికారులు ఆడియో, వీడియో రికార్డింగ్ చేశారు. విచారణ పూర్తయిన తర్వాత సిట్ బృందం కేసీఆర్ నివాసం నుంచి వెనుదిరిగింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతలు, వ్యాపారులు, ప్రముఖుల ఫోన్లను ట్యాప్ చేశారన్న ఆరోపణలపై ఈ కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే పలువురిని సిట్

- తరువాయి 2 వ పేజీలో...





# కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు

ముంబై: కేంద్ర బడ్జెట్ 2026 ప్రకటన స్టాక్ మార్కెట్లకు భారీ షాక్ ఇచ్చింది. ఫ్యూచర్స్, ఆప్షన్స్ ట్రేడింగ్‌పై సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్టీటీ) పెంచాలన్న ప్రభుత్వ నిర్ణయంతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు తెగబడ్డారు. ఫలితంగా, గత ఆరేళ్లలో బడ్జెట్ రోజున సూచీలు ఇంత భారీగా పతనం కావడం ఇదే తొలిసారి. శనివారం జరిగిన ప్రత్యేక ట్రేడింగ్ సెషన్‌లో సెన్సెక్స్, నిఫ్టీలు దాదాపు 2 శాతం మేర నష్టపోయాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 80,723 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 495 పాయింట్లు కోల్పోయి 24,825 వద్ద

- తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



మగ జిరాఫీలు ఆగ జిరాఫీలతో సంభోగం చేసే ముందు చాలా జాగ్రత్తలు తీసుకుంటాయట. ముఖ్యంగా అవి గర్భంతో ఉన్నాయా? అన్నది చెక్ చేసేందుకు ఆడ జిరాఫీల మూత్రాన్ని పరిశీలిస్తాయట. ఆ మూత్రం రుచిని బట్టి అవి గర్భంతో ఉన్నాయా? లేదా? అన్నది తెలుసుకొని సంభోగంలో పాల్గొంటాయట.

# కానిస్టేబుల్ సౌమ్య మృతి

- 8 రోజులుగా మృత్యువుతో పోరాటం
- శనివారం రాత్రి చివరి శ్వాస › 2
- కుటుంబానికి కోటి పరిహారం

నిజామాబాద్‌లో ఇటీవల గంజాయి అక్రమ రవాణాను అడ్డుకునే ప్రయత్నంలో ఆమెపై స్మగ్లర్లు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. నిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా, శనివారం రాత్రి ఆమె మృతి చెందారు.



# అనిల్ కుమార్ సింఘాల్‌పై వేటు

### టీటీడీ ఈవో పోస్టు నుంచి బదిలీ

### రవిచంద్రకు అదనపు బాధ్యతలు

తిరుమల, ఫిబ్రవరి 1 (ఈవార్తలు): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కార్యనిర్వహణాధికారి అనిల్ కుమార్ సింఘాల్ బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్న ముద్దాడ రవిచంద్రకు టీటీడీ ఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. అనిల్ కుమార్ సింఘాల్‌ను తక్షణమే సాధారణ పరిపాలన విభాగం (జీఏడీ)లో రిపోర్టు చేయాలని ఆదేశించింది. 1993 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అనిల్ కుమార్ సింఘాల్, 2017 మే నుంచి 2020 అక్టోబర్ వరకు తొలిసారి

- తరువాయి 2 వ పేజీలో...

# 28.33 లక్షల కోట్లు

### జనవరిలో భారీగా యూపీఐ లావాదేవీలు › 2






# కమర్షియల్ సిలిండర్‌పై రూ. 50 పెంపు

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న తరుణంలో, చమురు మార్కెటింగ్ కంపెనీలు వాణిజ్య గ్యాస్ వినియోగదారులకు షాక్ ఇచ్చాయి. 19 కేజీల వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధరను రూ. 50 మేర పెంచాయి. అయితే, గృహ అవసరాలకు

- తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

2-2-2026

మేషం: ధన సంబంధిత వ్యవహారాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. కుటుంబ వాతావరణం సమస్యాత్మకంగా ఉంటుంది. వ్యాపార వ్యవహారాలలో కుటుంబ సభ్యుల సలహాలు తీసుకోవడం మంచిది. వృత్తి ఉద్యోగాలు మిశ్రమంగా సాగుతాయి.

వృషభం: ఆర్థికంగా మరింత పురోగతి సాధిస్తారు. దీర్ఘకాలిక రుణాలు తీర్చి ఊరట చెందుతారు. సమాజంలో పెద్దలతో నూతన పరిచయాలు కలుగుతాయి. అన్ని రంగాల వారికి అనుకూల వాతావరణం ఉంటుంది. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. ఉద్యోగస్తులకు పదోన్నతి కలుగుతాయి.

మిథునం: ఇతరులతో తొందరపడి మాట్లాడటం మంచిది కాదు. వృత్తి ఉద్యోగాలలో అనుకూలత పెరుగుతుంది. నూతన గృహ నిర్మాణ ప్రయత్నాలు వాయిదా వేస్తారు. స్థిరాస్తి క్రయ విక్రయాలు మందకొడిగా సాగుతాయి. బంధుమిత్రుల నుండి ఊహించని వివాదాలు కలుగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

కర్కాటకం: వృత్తి ఉద్యోగాలలో అదనపు పని భారం నుండి ఉపశమనం లభిస్తుంది. బంధు మిత్రుల నుండి వివాదాలకు చెందిన సమాచారం అందుతుంది. గృహమున విందు వినోద కార్యక్రమాలు నిర్వహిస్తారు. వ్యాపారాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి. సంతాన విద్యా విషయాలపై దృష్టి సారిస్తారు.

సింహం: స్నేహితుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి అనుకూలిస్తుంది. నిరుద్యోగులకు అనుకూలత వాతావరణం ఉంటుంది. వృత్తి వ్యాపారాలు విస్తరిస్తాయి. ఉద్యోగులకు అధికారుల ఆదరణ లభిస్తుంది. కుటుంబ సభ్యులతో ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు.

కన్య: సామాజిక సేవా కార్యక్రమాల్లో విశేషంగా పాల్గొంటారు. నూతన వ్యాపార ప్రారంభానికి శ్రీకారం చుడతారు. అవసరానికి ధనం అందుతుంది. దీర్ఘకాలిక ఋణాలు తీర్చగలుగుతారు. వృత్తి ఉద్యోగాలలో స్వల్ప స్థానచలనాలు చోటు చేసుకుంటాయి. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

తుల: నిరుద్యోగులకు పెద్దల అనుగ్రహంతో నూతన అవకాశాలు అందుతాయి. వృత్తి వ్యాపార కీలక నిర్ణయాలు తీసుకుంటారు. మిత్రులతో ఉన్న వివాదాలను పరిష్కరించుకుంటారు. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. ఆరోగ్య విషయాలలో స్వల్ప ఇబ్బందులు ఉంటాయి.

వృశ్చికం: గృహమున సంతాన వివాహ శుభకార్య ప్రస్తావన వస్తుంది. సమాజంలో ప్రముఖుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. ధన సంబంధ వ్యవహారాలు కలిసివస్తాయి. ప్రయాణాలలో వాహనాలు నడిపే విషయంలో అప్రమత్తంగా ఉండాలి. వృత్తి ఉద్యోగాలలో సానుకూల వాతావరణం ఉంటుంది.

ధనస్సు: సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. వృత్తి వ్యాపారాలు రెట్టించిన ఉత్సాహంగా సాగుతాయి. సంతానం విద్యా విషయాలలో శుభవార్తలు అందుతాయి. దూర ప్రాంత బంధు మిత్రుల ఆగమనం సంతోషం కలిగిస్తుంది. నిరుద్యోగుల ప్రయత్నాలు సఫలమౌతాయి. అన్ని వైపుల నుండి ఆదాయం అందుతుంది.

మకరం: పాత రుణాలను కొంతవరకు తీర్చగలుగుతారు. దూరప్రాంత బంధు మిత్రుల నుండి అందిన సమాచారం ఆశ్చర్యం కలిగిస్తాయి. ధన పరంగా ఇబ్బందులు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతారు. వృత్తి వ్యాపారాలలో స్వంత నిర్ణయాలు చెయ్యడం మంచిది. సంతాన ఆరోగ్య విషయంలో అశ్రద్ధ మంచిది కాదు.

కుంభం: చిన్ననాటి మిత్రులతో కొన్ని విషయాలలో విభేదిస్తారు. తల్లిదండ్రుల ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. చేపట్టిన పనులు జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. నూతన గృహ వాహన కొనుగోలు ప్రయత్నాలు వాయిదా పడతాయి. ఉద్యోగ వ్యాపారములు మందకొడిగా సాగుతాయి.

మీనం: ఆప్తులతో వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. గతంలో జరిగిన కొన్ని సంఘటనలు గుర్తుచేసుకుని బాధపడతారు. ఇంటా బయట అనుకూలత పెరుగుతుంది. గృహమున శుభకార్యాలకు ధనవ్యయం చేస్తారు. వ్యాపారాలలో ఆర్థికంగా లాభాలు అందుకుంటారు. సోదరులతో స్థిరాస్తి ఒప్పందాలు చేసుకుంటారు.

# రైతు.. రక్షణ




మొదటి పేజీ తరువాయి

నిధులతో దేశవ్యాప్తంగా పలు కీలక ప్రాజెక్టులకు ఊతం లభించనుంది. ఇందులో భాగంగా పర్యావరణ అనుకూల ప్రయాణ వ్యవస్థలను ప్రోత్సహించేందుకు ఏడు హై-స్పీడ్ రైల్ కారిడార్లను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. వీటిలో ముంబై-పుణె, పుణె-హైదరాబాద్, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై, చెన్నై-బెంగళూరు కారిడార్లు ఉన్నాయి. దీంతో పాటు తూర్పున డంకుని నుంచి పశ్చిమాన సూరత్ వరకు కొత్త ప్రత్యేక సరుకు రవాణా కారిడార్లను ఏర్పాటు చేయనున్నారు. రాబోయే ఐదేళ్లలో 20 కొత్త జాతీయ జలమార్గాలను అందుబాటులోకి తీసుకురానున్నారు.

### శాఖల వారీగా కేటాయింపులు:

1.ఆర్థిక మంత్రిత్వ శాఖ: ఈ బడ్జెట్‌లో అత్యధిక కేటాయింపులు పొందింది ఆర్థిక శాఖే. ఈ శాఖకు మొత్తం రూ. 19.72 లక్షల కోట్లు కేటాయించారు. ఇందులో రెవెన్యూ వ్యయం రూ. 17.22 లక్షల కోట్లు కాగా, మూలధన వ్యయం రూ. 2.50 లక్షల కోట్లుగా ఉంది. ఈ నిధులు ప్రధానంగా వడ్డీ చెల్లింపులు, వివిధ సబ్సిడీలు, రాష్ట్రాలకు బదిలీ చేయాల్సిన నిధుల కోసం వినియోగిస్తారు. ఈ బడ్జెట్‌లో ద్రవ్యలోటును జీడీపీలో 4.3%గా లక్ష్యంగా నిర్దేశించారు.

2.రక్షణ మంత్రిత్వ శాఖ: కేటాయింపుల్లో రక్షణ శాఖ రెండో స్థానంలో నిలిచింది. ఈ శాఖకు రూ. 7.85 లక్షల కోట్లు కేటాయించారు. ఇందులో రెవెన్యూ వ్యయం రూ. 5.54 లక్షల కోట్లు, మూలధన వ్యయం రూ. 2.31 లక్షల కోట్లు. సైనిక ఆధునీకరణ, ఆపరేషనల్ సంసిద్ధత, మాజీ సైనికుల పెన్షన్లు, కొత్త విమానాలు, నౌకాదళ ప్లాట్‌ఫామ్‌లు, అన్‌మ్యాన్డ్ సిస్టమ్స్ కొనుగోలుకు ఈ నిధులను వెచ్చిస్తారు. ముఖ్యంగా 'ఆత్మనిర్భర్ భారత్' కింద దేశీయ రక్షణ ఉత్పత్తుల తయారీకి ప్రాధాన్యం ఇచ్చారు.

3.రహదారులు, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ: మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తూ ఈ శాఖకు రూ. 3.10 లక్షల కోట్లు కేటాయించారు. ఇందులో ఎక్కువ భాగం మూలధన వ్యయమే కావడం గమనార్హం. దేశవ్యాప్తంగా జాతీయ రహదారుల నిర్మాణం, లాజిస్టిక్స్ వ్యవస్థను బలోపేతం చేయడంపై దృష్టి సారించారు.



4.రైల్వే మంత్రిత్వ శాఖ: భారతీయ రైల్వేల అభివృద్ధికి ఈ బడ్జెట్‌లో రూ. 2.81 లక్షల కోట్లు కేటాయించారు. రైల్వే నెట్‌వర్క్ విస్తరణ, స్టేషన్ల పునరాభివృద్ధి, ప్రయాణికుల భద్రత, సౌకర్యాల మెరుగుదలకు ఈ నిధులను ఉపయోగిస్తారు.

5.హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ: దేశ అంతర్గత భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ హోం శాఖకు రూ. 2.55 లక్షల కోట్లు కేటాయించారు. సరిహద్దుల నిర్వహణ, పోలీసు బలగాల ఆధునీకరణ, సైబర్ భద్రత వంటి కీలక అంశాలకు ఈ నిధులను ఖర్చు చేస్తారు.

6.వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజాపంపిణీ శాఖ: ఈ శాఖకు రూ. 2.39 లక్షల కోట్లు కేటాయించారు. ఇందులో అధిక మొత్తం ఆహార సబ్సిడీలు, ప్రజా పంపిణీ వ్యవస్థ (రేషన్) నిర్వహణ కోసం వినియోగిస్తారు.

7.గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రూ. 1.97 లక్షల కోట్లు కేటాయించారు. గ్రామీణ గృహ నిర్మాణ పథకాలు, ఉపాధి హామీ, ఇతర జీవనోపాధి పథకాల అమలుకు ఈ నిధులు తోడ్పడతాయి.

8.రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ: రైతులకు ప్రయోజనం చేకూర్చేలా ఎరువుల సబ్సిడీల కోసం ఈ శాఖకు రూ. 1.77 లక్షల కోట్లు కేటాయించారు.

9.వ్యవసాయం, రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ: రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసే లక్ష్యంతో ఈ శాఖకు రూ. 1.40 లక్షల కోట్లు కేటాయించారు. అగ్రి-టెక్, 'భారత్-విస్తార్' వంటి కార్యక్రమాల ద్వారా వ్యవసాయ రంగంలో సాంకేతికతను ప్రోత్సహించడంపై దృష్టి పెట్టారు.

10. విద్యా మంత్రిత్వ శాఖ: పాఠశాల విద్య, ఉన్నత విద్య, పరిశోధనల కోసం విద్యాశాఖకు రూ. 1.39 లక్షల కోట్లు కేటాయించారు.

11. ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ: ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ ఆరోగ్య శాఖకు రూ. 1.07 లక్షల కోట్లు కేటాయించారు. దేశంలో హెల్త్‌కేర్ వ్యవస్థలను బలోపేతం చేయడానికి ఈ నిధులు ఉపయోగపడతాయి.

12. జల్ శక్తి మంత్రిత్వ శాఖ: తాగునీరు, పారిశుధ్యం, సాగునీటి ప్రాజెక్టుల కోసం ఈ శాఖకు రూ. 94,800 కోట్లు కేటాయించారు.

13. గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ: పట్టణాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ఈ శాఖకు రూ. 85,522 కోట్లు కేటాయించినట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు.

### పన్నులు, ఇతర ప్రతిపాదనలు

పన్ను చెల్లింపుదారులకు సౌలభ్యం కల్పించేందుకు పలు సంస్కరణలు ప్రతిపాదించారు. ఏప్రిల్ 2026 నుంచి 'కొత్త ఆదాయపు పన్ను చట్టం, 2025' అమల్లోకి రానుంది. విదేశీ పర్యటన ప్యాకేజీలపై టీసీఎస్ రేటును 2 శాతానికి తగ్గించారు. వ్యక్తిగత వినియోగం కోసం దిగుమతి చేసుకునే వస్తువులపై బేసిక్ కస్టమ్స్ సుంకాన్ని 20% నుంచి 10%కి తగ్గించడం ద్వారా సామాన్యులకు ఊరట కల్పించారు. క్యాన్సర్ చికిత్సకు ఉపయోగించే 17 రకాల మందులపై బేసిక్ కస్టమ్స్ సుంకాన్ని మినహాయించారు. మరోవైపు, ఫ్యూచర్స్ ట్రేడింగ్‌పై సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్టీటీ)ని 0.02% నుంచి 0.05%కి పెంచారు. మొత్తం మీద ఈ బడ్జెట్, దీర్ఘకాలిక వృద్ధి, ఉపాధి కల్పన లక్ష్యంగా మౌలిక వసతులు, తయారీ రంగాలపై దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది.

## అనిల్ కుమార్ సింఘాల్‌పై వేటు

మొదటి పేజీ తరువాయి

టీటీడీ ఈవోగా సేవలందించారు. అనంతరం గతేడాది సెప్టెంబరులో రెండోసారి ఈ పదవిని చేపట్టారు. కేవలం ఐదు నెలల కాలంలోనే ఆయన బదిలీ కావడం టీటీడీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కాగా, తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడకంపై సిట్ నివేదిక వచ్చిన కొన్ని రోజుల్లోనే ఈ బదిలీ జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## 4.50 గంటలు

మొదటి పేజీ తరువాయి

విచారించింది. నిందితులు ఇచ్చిన స్టేట్‌మెంట్ల ఆధారంగానే మాజీ సీఎం కేసీఆర్‌ను సిట్ అధికారులు విచారించినట్టు తెలుస్తోంది. విచారణ అనంతరం కేటీఆర్, హరీశ్ రావు, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో కేసీఆర్ మాట్లాడారు.

### శ్రేణులకు కేసీఆర్ అభివాదం

సిట్ విచారణ అనంతరం అభిమానులకు కేసీఆర్ అభివాదం చేశారు. చిరునవ్వుతో బీఆర్ఎస్ శ్రేణులకు నమస్కరించి.. పిడికిలి బిగబట్టిన కేసీఆర్ కాంగ్రెస్ సర్కార్ కుట్రలకు భయపడేది లేదు అని స్పష్టం చేశారు. ఆయన వెంట కుమారుడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్ రావు, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

### ప్రతి ప్రశ్నకు కేసీఆర్ కుండబద్ధలు కొట్టారు: కేటీఆర్

బీఆర్ఎస్ అధినేత కేసీర్ సిట్ విచారణపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. సిట్ అధికారులు చట్టాన్ని గౌరవించలేదని, అయినా సరే కేసీఆర్‌ను విచారణకు సంపూర్ణంగా సహకరించారని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అడిగించినట్టుగా సిట్ ప్రశ్నలు వేస్తోందని మండిపడిన ఆయన.. ప్రతి పశ్నకు కుండబద్ధలు కొట్టినట్టు కేసీఆర్ బదులిచ్చాని వెల్లడించారు. సిట్ విచారణ ఎర్రవల్లిలోనే జరిపే విషయంపై కోర్టుకు వెళ్తే తమకు అనుకులూంగా తీర్పు వచ్చేదని.. కానీ తాము అలా చేయలేదని కేటీఆర్ చెప్పారు. కేసీఆర్ సిట్ విచారణ పూర్తయ్యాక నందినగర్‌లోని నివాసంలోనే కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ప్రజల్లో అపోహలు, అసత్యాలు సృష్టించేందుకు సిట్ విచారణను కాంగ్రెస్ సర్కార్ కొనసాగిస్తోందని కేటీఆర్ దుయ్యబట్టారు. 'ఈ కేసులో లీకులే తప్ప అధారాలు లేవు. ఫోన్ ట్యాపింగ్ కేసులో డొల్లతనం క్రమంగా బయటపడుతోంది. ఎలాంటి తప్పు జరగలేదని తేలిపోయింది' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేర్కొన్నారు. 'రెండేళ్ల కాంగ్రెస్ పాలనను మూడు ముక్కల్లో చెప్పొచ్చు. వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చడమే కాంగ్రెస్ పాలన .. కాంగ్రెస్ బీజేపీ అసమర్థత వల్ల రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతోంది అని ఆయన తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో ఈసారి కూడా అన్యాయం జరిగింది. 808 గుండు సున్నా అని కాంగ్రెస్, బీజేపీకి తెలుసు. డైవర్షన్, సబ్‌వర్షన్ పర్వర్షన్ అని కేటీఆర్ మండిపడ్డారు. ఢిల్లీకి రేవంత్ 50-60 ట్రిప్పులు కొట్టినా ఏం సాధించలేకపోయార'ని ఆయన ఎద్దేవా చేశారు. ఎక్సైజ్ కానిస్టేబుల్‌ను గంజాయి ముఠా చంపితే పట్టించుకునే నాథుడే లేడని, మేడారం జాతరలోని వసతులు అధ్వాన్నంగా ఉన్నాయని భక్తులు అసంతృప్తి వెళ్లగక్కారని ఆయన ఈ సందర్భంగా కాంగ్రెస్ పాలనను ఖండించారు. ఇకనైనా డైవర్షన్ రాజకీయాలు ఆపేసి అభివృద్ధిపై దృష్టి పెట్టాలని.. ఇచ్చిన హామీలను అమలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు

మొదటి పేజీ తరువాయి

ముగిసింది. అయితే, రోజు మధ్యలో అమ్మకాల ఒత్తిడి తారాస్థాయికి చేరడంతో సెన్సెక్స్ ఏకంగా 3,000 పాయింట్ల వరకు పతనమై 79,899.42 వద్ద ఇంట్రా-డే కనిష్ఠాన్ని తాకింది. నిఫ్టీ కూడా 24,572 స్థాయికి పడిపోయింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో ఎస్టీటీ పెంపును ప్రకటించడమే ఈ అమ్మకాలకు ప్రధాన కారణమైంది. ఫ్యూచర్స్ ట్రేడ్స్‌పై పన్నును 0.02 శాతం నుంచి 0.05 శాతానికి, ఆప్షన్స్ ప్రీమియంపై పన్నును 0.1 శాతం నుంచి 0.15 శాతానికి పెంచారు. ఈ నిర్ణయంతో ట్రేడింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో అమ్మకాలు వెల్లువెత్తాయి. మార్కెట్‌లోని భయాలకు అద్దం పట్టే ఇండియా ఎ×శ సూచీ దాదాపు 12 శాతం ఎగబాకింది. ఈ నష్టాలు కేవలం పెద్ద కంపెనీలకే పరిమితం కాలేదు. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా 2 శాతం పైగా నష్టపోయాయి. ఐటీ రంగం మినహా అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ షేర్లు అత్యధికంగా 6% పతనమవగా, మెటల్ షేర్లు 4 శాతం నష్టపోయాయి. భారత్ ఎలక్ట్రానిక్స్, హిందాల్కో, ఓఎన్‌జీసీ వంటి షేర్లు 6 శాతం వరకు నష్టపోగా, ప్రతికూల మార్కెట్‌లోనూ విప్రో, టీసీఎస్ వంటి ఐటీ స్టాక్స్ 2% లాభపడి కాస్త ఊరటనిచ్చాయి.

### కమర్షియల్ సిలిండర్‌పై రూ. 50 పెంపు

వాడే 14.2 కేజీల సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు చేయకపోవడం సామాన్యులకు ఊరటనిచ్చే అంశం. తాజా పెంపుతో దేశ రాజధాని ఢిల్లీలో వాణిజ్య సిలిండర్ ధర రూ. 1,740.50కి చేరింది. కోల్‌కతాలో రూ. 1,844.50, ముంబైలో రూ. 1,692, చెన్నైలో రూ. 1,899.50కి చేరుకున్నాయి. గత జనవరిలో కూడా ఈ సిలిండర్లపై ఏకంగా రూ. 111 పెంచిన సంగతి తెలిసిందే. వరుసగా రెండు నెలల పాటు ధరలు పెరగడంతో హోటళ్లు, క్యాంటీన్లు, రోడ్డు పక్కన ఉండే ఆహార దుకాణాల్లో తినుబండారాల ధరలు పెరిగే అవకాశం ఉంది. ఒకవైపు గ్యాస్ ధరలు పెరిగినప్పటికీ, విమాన ఇంధనం ధరలను తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఢిల్లీలో కిలోలీటరు ఏటీఎఫ్ ధర సుమారు రూ. 91,393కు తగ్గింది. అంతర్జాతీయంగా చమురు ధరల్లో మార్పుల కారణంగా ఏటీఎఫ్ ధరను సుమారు ఒక శాతం వరకు తగ్గించారు. దీనివల్ల విమాన టికెట్ల ధరలు కొంతవరకు తగ్గే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## కానిస్టేబుల్ సౌమ్య మృతి

### 8 రోజులుగా మృత్యువుతో పోరాటం

పంజాగుట్ట/హైదరాబాద్, నిజామాబాద్, ఫిబ్రవరి 1 (ఈవార్తలు): గంజాయి ముఠా దాడిలో తీవ్రంగా గాయపడిన ఎక్సైజ్ మహిళా కానిస్టేబుల్ గాజుల సౌమ్య మృతి చెందారు. నిజామాబాద్‌లో ఇటీవల గంజాయి అక్రమ రవాణాను అడ్డుకునే ప్రయత్నంలో ఆమెపై స్మగ్లర్లు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఈ క్రమంలో ఆమెను హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా, శనివారం రాత్రి ఆమె మృతి చెందారు. ఇటీవల నిజామాబాద్ నగర శివారులో అర్ధరాత్రి తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో గంజాయి ముఠా హల్‌చల్ చేసింది. ఎక్సైజ్ సిబ్బందిని తప్పించుకునే ప్రయత్నంలో స్మగ్లర్లు తమ కారుతో ఎక్సైజ్ సిబ్బందిని ఢీ కొట్టారు. ఈ ఘటనలో మహిళా కానిస్టేబుల్ సౌమ్య తీవ్రంగా గాయపడ్డారు. ఘటన అనంతరం అప్రమత్తమైన పోలీసులు స్మగ్లర్ల వాహనాన్ని వెంబడించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన నిందితులు నిర్మల్ జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. విధి నిర్వహణలో కానిస్టేబుల్ సౌమ్య ప్రాణాలు కోల్పోవడంతో ఎక్సైజ్ శాఖలో విషాదఛాయలు అలుముకున్నాయి. గంజాయి స్మగ్లర్ల దాడిలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ గజ్జల సౌమ్య (25) కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అండగా నిలిచింది. ఆమె కుటుంబానికి రూ. 1 కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. దీంతో పాటు సౌమ్య సోదరుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వనున్నట్లు తెలిపింది. ఆమె పదవీ విరమణ వయసు వరకు పూర్తి జీతాన్ని కుటుంబ సభ్యులకు చెల్లించనున్నట్లు వెల్లడించింది. సౌమ్య అంత్యక్రియలను పోలీసు లాంఛనాలతో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆదివారం ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గాంధీ ఆసుపత్రికి వెళ్లి సౌమ్య భౌతికకాయానికి నివాళులర్పించారు. విధి నిర్వహణలో ఆమె చూపిన ధైర్యం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ ఘటనకు కారణమైన వారిని కఠినంగా శిక్షిస్తామని, ఇలాంటివి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎక్సైజ్ సిబ్బంది భద్రత ప్రభుత్వ బాధ్యత అని, వారికి ఆయుధాలు అందించే ప్రతిపాదన పరిశీలనలో ఉందని తెలిపారు. సౌమ్య కుటుంబానికి ఒకరోజు జీతాన్ని విరాళంగా ఇవ్వాలని నిర్ణయించుకున్న ఎక్సైజ్ ఉద్యోగులను మంత్రి అభినందించారు.

## రూ.28.33 లక్షల కోట్లు

### జనవరిలో భారీగా యూపీఐ లావాదేవీలు

న్యూఢిల్లీ: యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ డిజిటల్ పేమెంట్స్ సిస్టమ్‌లో జనవరి నెలలో సరికొత్త రికార్డు క్రియేట్ చేసింది. ఈ నెలలో కొనుగోళ్ల చెల్లింపుల లావాదేవీలు ఎక్కువగా యూపీఐ ద్వారా జరగడంతో వీటి సంఖ్య, విలువ భారీగా పెరిగినట్లు నేషనల్ పేమెంట్స్,కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తెలిపింది. తాజాగా విడుదల చేసిన డేటా ప్రకారం, జనవరిలో ప్రముఖ యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ ద్వారా రికార్డు స్థాయిలో రూ.28.33 లక్షల కోట్లు లావాదేవీలు నమోదయ్యాయి. లావాదేవీలు విలువ , వాల్యూమ్ పరంగా వరుసగా 21.70 బిలియన్లనుగా ఉందని తెలిపింది. డిసెంబర్ నెలలో యూపీఐ లావాదేవీల విలువ రూ.27.97 లక్షల కోట్లు అని పేర్కొంది. నెలవారీ ప్రాతిపదికన, విలువ పరంగా వృద్ధి 21 శాతంగా ఉందని తెలిపింది. జనవరి నెలలో సగటు రోజువారీ లావాదేవీ 700 మిలియన్లు, సగటు విలువ రూ. 91,4033 కోట్లు. డిసెంబర్ నెలలో రూజువారి లావాదేవీల సంఖ్య 698 మిలియన్లు నమోదయ్యాయి. వరల్డ్ లైన్ సీఈఓ రమేశ్ నరసింహన్ మాట్లాడుతూ, యూపీఐ వృద్ధి వేగం కొనసాగుతోందని తెలిపారు. ఈ ఏడాది జనవరి 2026లోనే, భారతీయులు రూ. 28.33 లక్షల కోట్ల విలువైన 21.7 బిలియన్ యూపీఐ లావాదేవీలు చేశారని వెల్లడించారు.

## గద్దర్ అవార్డుల దరఖాస్తులకు గడువు పొడిగింపు

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఈవార్తలు): తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డుల (2025)దరఖాస్తుల సమర్పణ గడువును ఫిబ్రవరి 5వ తేదీ వరకు పొడిగించినట్లు తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎఫ్‌డీసీ) తెలిపింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న గద్దర్ ఫిల్మ్ అవార్డుల కార్యక్రమాన్ని ఈసారి మరింత ముందుగానే నిర్వహించేందుకు ఎఫ్‌డీసీ ఏర్పాట్లు చేస్తోంది. గత ఏడాది ప్రారంభమైన ఈ అవార్డుల నిర్వహణపై ప్రభుత్వం జనవరిలోనే కసరత్తు మొదలుపెట్టింది. గద్దర్ అవార్డులకు సంబంధించిన విధివిధానాలను ఖరారు చేసిన ప్రభుత్వం, ఈసారి ప్రముఖ కవి సి. నారాయణరెడ్డి పేరుతో కూడా ప్రత్యేక అవార్డును అందించనుంది. ఈ నేపథ్యంలో గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్‌కు సంబంధించిన అప్లికేషన్లు జనవరి 31 వరకు అందుబాటులో ఉంచనున్నట్లు, ఫిబ్రవరి 3లోగా వాటిని సబ్మిట్ చేయాలని తొలుత ప్రకటించింది. అయితే వరుసగా బ్యాంక్ సెలవులు రావడంతో గడువును ఫిబ్రవరి 5వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు అప్లికేషన్లు అందజేయనున్నట్లు తెలిపింది. అలాగే అదే రోజు సాయంత్రం 4 గంటలలోగా అప్లికేషన్లను తప్పనిసరిగా సబ్మిట్ చేయాల్సి ఉంటుందని తెలిపింది. ఈ అవకాశాన్ని సినిమా రంగానికి చెందిన వారు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సూచించింది.

## బలూచిస్థాన్‌లో నరమేధం

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లోని అతిపెద్ద ప్రావిన్స్ బలూచిస్థాన్‌లో ఉగ్రవాదులు మారణహోమం సృష్టించారు. శుక్రవారం రాత్రి మొదలైన ఈ దాడులు శనివారం వరకు కొనసాగాయి. క్వెట్టా, గ్వాదర్, మక్రాన్ వంటి 12 ప్రధాన పట్టణాల్లో భద్రతా బలగాలు, పోలీస్ స్టేషన్లు, సాధారణ పౌరులనే లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు విరుచుకుపడ్డారు. ఈ దాడులను తిప్పికొట్టే క్రమంలో పాక్ సైన్యం జరిపిన ఎదురుకాల్పుల్లో 70 మంది ఉగ్రవాదులు హతమవగా, 10 మంది భద్రతా సిబ్బంది మరణించారు. నిషేధిత సంస్థ 'బెలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ' (బీఎల్ఏ) ఈ దాడులకు బాధ్యత వహిస్తూ ప్రకటన విడుదల చేసింది. తమ 'ఆపరేషన్ హెరోఫ్' రెండో దశలో భాగంగానే ఈ దాడులు చేసినట్లు పేర్కొంది. నుష్కిలోని కౌంటర్ టెర్రరిజం డిపార్ట్‌మెంట్ హెడ్ క్వార్టర్స్‌ను, ఫ్రాంటియర్ కార్ప్స్ స్థావరాలను తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు బీఎల్ఏ ప్రకటించినప్పటికీ, పాక్ ప్రభుత్వం ఈ విషయాన్ని ధ్రువీకరించలేదు. నసీరాబాద్ జిల్లాలో రైల్వే ట్రాక్‌పై అమర్చిన బాంబులను భద్రతా దళాలు గుర్తించి నిర్వీర్యం చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. బలూచిస్థాన్‌లో కొన్నేళ్లుగా తీవ్రవాద హింస విపరీతంగా పెరిగిపోయింది.



(ప్రశ్నలు... జవాబులు)

# బడ్జెట్ 2026-27

**ప్రతి ఏడాది బడ్జెట్ వచ్చిన తర్వాత ప్రజలలో ఒకే ప్రశ్న ఉంటుంది. ఇది మనకు ఉపయోగమా? మన జీవితంలో ఏమి మారుతుంది? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. మరి బడ్జెట్ వల్ల మనకు లాభాలేంటి? నష్టాలేంటి? అన్నది తెలుసుకోవడం అవశ్యం. ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ పీ.మణిశంకర్ 'ఈవార్తలు' పాఠకుల కోసం ప్రత్యేకంగా పలు సందేహాలను నివృత్తి చేశారు.**

**1. బడ్జెట్ 2026--27 తెలంగాణ సాధారణ ప్రజలకు ఉపయోగకరమా?**

జవాబు: ఈ బడ్జెట్ ఎక్కువ లాభాలు ఇచ్చేదీ కాదు, ఎక్కువ భారం పెట్టేదీ కాదు. తక్షణ నగదు ప్రయోజనాలు ఇవ్వలేదు, అలాగే కొత్త భారాలు కూడా మోపలేదు. సాధారణంగా చెప్పాలంటే రోజువారీ జీవితంలో ఒక్కసారిగా పెద్ద మార్పు ఉండదు, కానీ నష్టమూ ఉండదు.

**2. వ్యక్తిగత ఆదాయ పన్ను రేట్లు తగ్గించారా?**

జవాబు: లేదు. ఆదాయ పన్ను స్లాబ్ రేట్లలో మార్పు లేదు. దీనివల్ల జీతం చేతిలోకి ఎక్కువగా రావడం లేదు. కానీ పన్ను భారం కూడా పెరగలేదు. ఇది స్థిరత్వాన్ని చూపించే బడ్జెట్.

**3. జాతభత్యాలు పొందే వారికి ఏమైనా ఉపశమనం ఉందా?**

జవాబు: ఉపశమనం పన్ను విధానంలో ఉంది. పన్ను మొత్తంలో కాదు. రిటర్న్ సవరించడానికి ఎక్కువ సమయం. చిన్న తప్పులకు శిక్షలు తగ్గింపు. క్రిమినల్ కేసుల భయం తగ్గింపు. ఇవి ఉద్యోగుల మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయి.

**4. ఈ బడ్జెట్ వల్ల జీతం చేతిలోకి ఎక్కువ వస్తుందా?**

జవాబు: లేదు. స్టాండర్డ్ డిడక్షన్ లేదా ఇతర డిడక్షన్లలో పెంపు లేదు. అందువల్ల అదనపు నగదు ఆశించకూడదు.

**5. చిన్న వ్యాపారులు, దుకాణదారులకు ఏమి లాభం?**

జవాబు: ప్రక్రియలు సులభమవుతాయి. రుణాలు పొందడం సులువు. చెల్లింపులు వేగంగా రావచ్చు. తనిఖీలు, పేపర్ వర్క్ తగ్గుతాయి. కానీ జీఎస్టీ రేట్లు తగ్గలేదు. అమలు మీదే ఫలితం ఆధారపడి ఉంటుంది.

**6. ఎంఎస్ఎంఈలకు ఈ బడ్జెట్ ఎలా ఉపయోగపడుతుంది?**

జవాబు: నమోదు చేసుకుని, నియమాలను పాటించే




ఎంఎస్ఎంఈలకు ఎక్కువ లాభం. నిధులు, నగదు ప్రవాహం మెరుగుపడే అవకాశం ఉంది. అసంఘటిత చిన్న వ్యాపారాలకు తక్షణ లాభం ఉండకపోవచ్చు.

**7. యువతకు ఉద్యోగాలు వస్తాయా?**

జవాబు: వస్తాయి - కానీ క్రమంగా. ఇన్ఫ్రాస్ట్రక్చర్, తయారీ, ఐటీ, ఆరోగ్యం, సేవల రంగాల్లో ఉద్యోగాలు ఏర్పడతాయి. అవి తక్షణమే కాకుండా కొంత కాలం తర్వాత వస్తాయి.

**8. హైదరాబాద్ ఐటీ ఉద్యోగులకు ఈ బడ్జెట్ ప్రభావం ఏమిటి?**

జవాబు: ఐటీ రంగానికి స్థిరత్వం ఇచ్చింది. కొత్త రాయితీలు లేవు, ప్రతికూల మార్పులూ లేవు. ఉద్యోగ భద్రత ఉంటుంది, కానీ జీతాల పెంపు ఈ బడ్జెట్ వల్ల కాదు.

**9. తెలంగాణ రైతులకు ఏమి లాభం?**

జవాబు: మత్స్యకార్యం, పాడి, ఉద్యానవన పంటలు చేసే రైతులకు ఎక్కువ మద్దతు. సంప్రదాయ పంట రైతులకు తక్షణ ఉపశమనం తక్కువ. వైవిధ్య వ్యవసాయానికి ప్రోత్సాహం ఉంది.

**10. మహిళలు, ఎస్హెచ్జీలకు ఎలా ఉపయోగపడుతుంది?**

జవాబు: మహిళా వ్యాపారాలకు మార్కెట్ అవకాశాలు పెరుగుతాయి. అయితే ఆదాయం పెరగడం రాష్ట్ర, స్థానిక అమలుపై ఆధారపడి ఉంటుంది.

**11. ఆరోగ్య రంగంలో మార్పులు వస్తాయా?**

జవాబు: క్రమంగా మెరుగుదల ఉంటుంది. జిల్లా ఆసుపత్రులు, సిబ్బంది శిక్షణపై దృష్టి ఉంది. ప్రైవేట్ వైద్య ఖర్చులు తగ్గవు.

**12. విద్యార్థులు, తల్లిదండ్రులకు ఏమి మార్పు?**

జవాబు: విద్యను ఉద్యోగాలకు అనుసంధానం చేయడంపై దృష్టి. మౌలిక వసతులు పెరుగుతాయి, కానీ విద్య ఖర్చులు తగ్గవు.

**13. విదేశీ ప్రయాణాలు లేదా చదువు చౌకయ్యాయా?**

జవాబు: మొత్తం ఖర్చు తగ్గలేదు. కానీ ముందుగా పెద్ద మొత్తాన్ని బ్లాక్ చేయాల్సిన అవసరం తగ్గింది. ఇది నగదు నిర్వహణకు ఉపశమనం.

**14. అవినీతి, వేధింపులు తగ్గుతాయా?**

జవాబు: ఆటోమేషన్ పెరిగింది, అధికారుల స్వేచ్ఛ తగ్గింది. దీంతో నిజాయతీ గల వారికి వేధింపులు తగ్గే అవకాశం ఉంది. అమలే ముఖ్యమైన అంశం.

**15. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతాయా?**

జవాబు: ప్రస్తుతం పెద్ద పెరుగుదల కనిపించడం లేదు. ఆర్థిక క్రమశిక్షణ వల్ల ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉంటుంది.

**16. విదేశీ ఆస్తుల డిస్క్లోజర్ గురించి భయం అవసరమా?**

జవాబు: చిన్న, నిజమైన తప్పులకు పరిమిత ఉపశమనం ఇచ్చారు. రూ.20 లక్షల లోపు (ఇమ్మూవబుల్ ప్రాపర్టీ కాకుండా) విదేశీ ఆస్తులైతే నిజమైన సందర్భాల్లో కేసులు ఉండవు. అయితే డిస్క్లోజర్ తప్పనిసరి. పెద్దగా దాచితే కఠిన చర్యలు ఉంటాయి.

**17. షేర్ మార్కెట్ ట్రేడర్లకు ఏమి ప్రభావం?**

జవాబు: ఫ్యూచర్స్, ఆప్షన్స్ ట్రేడింగ్ ఖర్చు పెరిగింది. తరచూ ట్రేడింగ్ చేసే వారికి లాభాలు తగ్గవచ్చు.

**18. దీర్ఘకాల పెట్టుబడిదారులకు ప్రభావముందా?**

జవాబు: లేదు. ఎస్ఐపీలు, మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి చేసే వారికి ప్రభావం తక్కువ.

**19. భారత్లో ఆదాయం పొందే ఎన్నారైలకు ఏమి మార్పు?**

జవాబు: ప్రక్రియలు సులభమయ్యాయి. పన్ను అనుసరణలో ఇబ్బందులు తగ్గుతాయి, కానీ కొత్త పన్ను రాయితీలు లేవు.

**20. ఎన్నారై ప్రాపర్టీ లావాదేవీల్లో మార్పు ఉందా?**

జవాబు: అవును. టీడీఎస్ చెల్లింపుల ప్రక్రియ సులభమైంది, ఆలస్యాలు తగ్గుతాయి.

**21. విదేశీ పెట్టుబడిదారులకు భారత మార్కెట్ ఎలా ఉంటుంది?**

జవాబు: భారత షేర్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టడం సులభమైంది. దీంతో పెట్టుబడులు పెరుగుతాయి, కానీ అస్థిరత్వం కూడా ఉండొచ్చు.

**22. ఈ బడ్జెట్లో ఏమి చౌకైంది? ఏమి ఖరీదైంది?**

జవాబు: ఖరీదయ్యేవి: సిగరెట్లు, బీడీలు, పాన్ మసాలా, గుట్కా, మద్యం, ఇనుము-బొగ్గు ఉప్పు వంటి ఖనిజాలు, ఫ్యూచర్స్ ఉ డెరివేటివ్ ట్రేడింగ్.

**చౌక: క్యాన్సర్, డయాబెటిస్ తదితర ఔషధాలు, సోలార్ ప్యానెల్స్, లిథియం బ్యాటరీ భాగాలు, ఈవీ బ్యాటరీలు, విమాన భాగాలు, స్మార్ట్ఫోన్లు, మైక్రోవేవ్ ఓవెన్లు, క్రీడా పరికరాలు, లెదర్ ఉత్పత్తులు, విదేశీ టూర్లు.**

**చివరి మాట: బడ్జెట్ 2026--27 ఒక స్థిరమైన, జాగ్రత్తతో రూపొందించిన బడ్జెట్. ఇది తక్షణ లాభాలు ఇవ్వదు. అలాగే కొత్త భారాలు కూడా మోపదు. భయపడాల్సిన బడ్జెట్ కాదు, అర్థం చేసుకుని జీవించాల్సిన బడ్జెట్.**



**- పీ. మణిశంకర్, చార్టెడ్ అకౌంటెంట్,**
(బీకాం, ఎల్ఎల్బీ, ఎంఎఫ్టీ, డిసా, టిసా, డీఐఆర్ఎం)

## జిల్లాకో గర్ల్స్ హాస్టల్

బాలికల విద్యను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ లో ప్రాధాన్యమిచ్చింది. బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బాలికల వసతి గృహాలపై కీలక ప్రకటన చేశారు. దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలో బాలికల హాస్టల్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. బాలికల విద్యను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. అదేవిధంగా, సంప్రదాయ వైద్య పరిశోధనకు జామ్నగర్లో పరిశోధన కేంద్రం, మూడు ఆయుర్వేద ఆస్పత్రులు ఏర్పాటు చేయనున్నట్లు నిర్మలమ్మ ప్రకటించారు. ఆతిథ్యరంగంలో జాతీయ సంస్థ ఏర్పాటు చేయనున్నట్లు, 20 పర్యాటక ప్రాంతాల్లో పదివేల గైడ్లను నియమించనున్నట్లు మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.

## 5 రాష్ట్రాల్లో రేర్ ఎర్త్ మినరల్స్ పథకం

రేర్ ఎర్త్ మినరల్స్ కోసం ఆంధ్రప్రదేశ్ సహా నాలుగు రాష్ట్రాల్లో ఖనిజాల వెలికితీతకు ప్రత్యేక పథకం తీసుకువస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్తో పాటు కేరళ, ఒడిశా, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. తీర ప్రాంత రాష్ట్రాలపై దృష్టి సారిస్తామని అన్నారు. సహజ వనరులున్న రాష్ట్రాలకు ప్రత్యేక ప్రోత్సాహకం అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆమె లోక్సభలో బడ్జెట్ను ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ, ఫార్మా, విద్య, పరిశోధనకు జాతీయ స్థాయిలో 3 కొత్త విద్యా సంస్థల స్థాపనకు నిర్ణయించినట్లు తెలిపారు. ఛాంపియన్ ఎంఎస్ఎంఈల కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు వెల్లడించారు. సెమీ కండక్టర్ ఇండియా మిషన్ 2.0 కోసం రూ.40 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. దేశంలో కొత్తగా మూడు రసాయన పార్కుల స్థాపన, ప్రపంచస్థాయి కంటెయినర్ ఉత్పత్తి కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. జౌళి రంగ విస్తరణ, ఆధునికీకరణ, ఉపాధి దిశగా మరిన్ని అడుగులు వేస్తున్నామని నిర్మలా సీతారామన్ తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనకు రూ.12.2 లక్షల కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. మన జౌళి ఉత్పత్తుల అంతర్జాతీయ బ్రాండింగ్ కోసం ప్రత్యేక కార్యాచరణ, మెగా టెక్స్టైల్స్ పార్కులు, పరిశ్రమలకు విద్యా సంస్థల అనుసంధానం వంటి వాటిని తన ప్రసంగంలో పేర్కొన్నారు.

## ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లు

ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లను నిర్మలా సీతారామన్ ప్రకటించారు. 1. పుణే-హైదరాబాద్, 2. హైదరాబాద్-బెంగళూరు, 3. హైదరాబాద్-చెన్నై, 4. ముంబై-పుణే, 5. బెంగళూరు-చెన్నై, 6. ఢిల్లీ-వారణాసి, 7. వారణాసి-సిలిగురి కారిడార్లను ప్రకటించారు. వారణాసి, పాట్నాలలో షిప్ రిపేర్ కర్మాగారాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఉపాధికి పెద్ద పీట వేస్తున్నట్లు చెప్పారు. వికసిత్ భారత్ కోసం బ్యాంకింగ్ రంగంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. టెక్స్టైల్ రంగం కోసం 5 సూత్రాలతో ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నామని, ఈ రంగం కోసం వచ్చే ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు కేటాయించనున్నట్లు వెల్లడించారు. సూక్ష్మతరహా పరిశ్రమల కోసం రూ.2 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. దేశంలో మూడు ఆయుర్వేద ఆసుపత్రులను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. యువత కోసం వైద్య రంగంలో కొత్త కోర్సులను తీసుకు రానున్నట్లు తెలిపారు.

## ఆదాయపు పన్నుపై దక్కని ఊరట

కేంద్ర బడ్జెట్ అంటేనే చాలామంది, ముఖ్యంగా వేతనజీవులు ఆదాయపు పన్నులో ఊరట కోసం వేచి చూస్తుంటారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం గతంలో ప్రవేశపెట్టిన పలు బడ్జెట్లలో వేతనజీవులకు భారీ ఊరట కల్పిస్తూ ప్రకటనలు చేసింది. ఈసారి కూడా ఆదాయపు పన్ను తగ్గింపుపై వేతనజీవులు ఆశగా ఎదురు చూసినప్పటికీ నిరాశ ఎదురైంది. కొత్త, పాత పన్ను విధానాల్లోని స్లాబుల్లో ఎటువంటి మార్పులు లేవని నిర్మలా సీతారామన్ వెల్లడించారు. విధానపరమైన అంశాల్లో మాత్రమే పన్ను చెల్లింపుదారులకు కాస్త ఊరట దక్కింది. ఐటీఆర్-1, ఐటీఆర్-2 ఫైలింగ్కు జులై 31 వరకు గడువు కల్పిస్తున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. నాన్-ఆడిట్ బిజినెస్లు, ట్రస్టులు ఫైలింగ్కు ఆగస్టు 31 వరకు గడువు ఇచ్చారు. ఆదాయపు పన్ను నిబంధనలు సరళతరం చేసినట్లు వెల్లడించారు. కొత్త చట్టాన్ని అర్థం చేసుకోవడానికి పన్ను చెల్లింపుదారులకు తగినంత సమయం ఇస్తామని తెలిపారు.

# ఈ పడిశం పోయేదెప్పుడు?

పడిశం బట్టి వారం రోజులాయె. ముక్కు దూలాలు మూసుకపోయి మూడొద్దులాయె. మొసెల్తలేదు. నోట్లె కెల్లే మొసదీస్కుంటున్న, నోట్లె కెల్లే మొసిడుస్తున్న. బండలు వట్టి ఎవలో గుద్దినట్టే తలికాయ దిమా దిమా అంటున్నది. కనుబొమ్మలల్ల కారం వెట్టినట్టే భగభగ మండుతున్నయి. ఇరాం లేకుండా పెయ్యి సవసవా మసుల్తున్నది. శెవుల్లకెల్లి శెక పొయ్యిలకెల్లి ఎల్లినట్టే ఎల్తున్నది. కండ్లు ఎర్రగై నీళ్లు వల వలా రాలుతున్నయి. అసలే పెండ్లాం, పోరగాండ్లు గల్లోన్ని, సూస్కుంటా ఉంటె పానం మీదికొస్తే మొదటికే మోసమైతదని ఒక ఇశారం జేసిన. ఇగ దావఖానకన్న వొయ్యొద్దామని ఒక్కశిత్తం జేస్కున్న. ఇంట్లకెల్లి ఇట్లా దావఖానకు బైలెల్లిన్నో లేదో.. 'నీకు జ్వరం లేదు, గిరం లేదు. నీకున్న రోగమల్లా ఆ ముక్కే. ఆ ముక్కు సక్కగైతే, నువ్వు మంచిగైతవ్. పొయ్యి ముందుగాల్ల ఆ ముక్కు సూపెట్టుకో' అని మా ఇంటామె శెప్పవట్టింది. ఔను, ఆమె శెప్పింది గూడ నిజమే! మూడు మూడొద్దుల్ల ఈ ముక్కులు మూస్కపోవుడేంది, ఈ జరమొచ్చుడేంది? అని ముక్కుకు సంబంధించిన దవాఖాన్లు ఎక్కడెక్కడున్నయని ఇశారం జేసిన. పేరుగల్ల ఓ పెద్ద గవర్నమెంట్ దావఖాన మదిల మెదిలింది. సక్కగ నా బండి ఆ దావఖానకే గొట్టిన.



క్యాబ్ డ్రైవర్ తాళ్లపెల్లి అరుణ్

2026, జనవరి 30.. శుక్లారం రోజు తొమ్మిదిన్నర గొద్తున్నది. దవాఖాన నిండా మందే ఉన్నరు. జనాలు రెండు లైన్లు గట్టిర్రు. ఒకటి ఆడోళ్లది, ఇంకోటి మొగోళ్లది. ఒక లైన్ల నిలవడి వాళ్లెంబటే నేన్గూడ నడ్శిన. నా ముందున్నోళ్లను ఒగల్ని మందలిస్తే రంగారెడ్డి జిల్లా మంచాల మండలం నుంచి ముక్కు సూపెట్టుకునేందుకు అచ్చినమన్నడు, ఇంకొగల్ని మందలిస్తే శెవినొప్పి వశపడక మిర్యాలగూడ నుంచి వచ్చినమన్నడు. అప్పుడే నా ఎన్కకొచ్చి నిలవడ్డ మనిషిని మందలిస్తే గొంతు నొప్పి ఉంటే పట్నం శివారు నుంచి వచ్చిన్నని శెప్పవట్టిండు. గంటైనా మా లైన్ ముందుకు కదుల్తలేదు. మజ్జమజ్జన అటుకెల్లి ఓ అటెండర్, ఇటుకెల్లి ఓ సెక్యూరిటీ గార్డు వచ్చి మమ్మల్ని గొడ్లను గదా గెదిమినట్టే గెదుముతున్నరు. ఈ లైన్ల నిల్సునోళ్లకు ఓ స్పెషల్ సౌకర్యం గూడ ఉన్నది. కాళ్లు గినా నొస్తే మజ్జ మజ్జన గూసునేందుకు కుర్సీలు గూడ ఏసిన్రు. కుర్సీలు గూడ లైన్ కొద్దే ఉంటయి. పది నిమిషాలకోసారి పదిరువై మందిని డాక్టర్ల దగ్గర్కి తోలుతున్నడు సెక్యూరిటీ గార్డు. పది మంది వొయినంక గల్మకు కట్టె అడ్డం బెడ్తున్నడు. వాళ్లయిపోంగనే మళ్లోసారి కట్టె దీస్తున్నడు. అట్లా సెక్యూరిటీ కట్టె తీసినప్పుడల్లా ఓ పదిరువై మంది రోగులు డాక్టర్ల దగ్గర్కి ఉర్కుతనే ఉన్నరు. ఆ సీన్ యాదికొస్తే బంజరుదొడ్లెకు బర్లనిడ్శినట్టే అనిపిస్తున్నది.

మూడోసారి సెక్యూరిటీ గార్డు గల్మకద్దం ఉన్న కట్టె దీసేసరికి నా వంతు వచ్చింది. పొయ్యి డాక్టర్ దగ్గర గూసున్న. 'ఏమైంది బాబు?' అనడిగిన డాక్టర్కు 'సార్ ముక్కులు మూస్కవోతున్నయి, ఒగ తుమ్ములు గావు, కనుబొమ్మలు గుంజుకొస్తున్నయి, మూడొద్దులకోసారి జ్వరమొస్తున్నది. నాకు వశపడక మీ దగ్గరికొచ్చిన' అని శెప్పవట్టిన. ఆయన నెత్తిమీదున్న లైట్ను కిందికనుకొని నా ముక్కులను సూడవట్టిండు. రెండు నిమిషాలు జూసిన ఆ డాక్టర్ నాకు 'నీ బొక్క వంకరైంది, ఆపరేషన్ జేయాలె, పొయ్యి ప్రైవేట్ దావఖాన్ల శేపిచ్చుకోపో' అని శెప్పవట్టిండు. 'అదేంది సార్? ఇది ఇంతపెద్ద దవాఖాన. ఆ ఆపరేషనేదో మీరే జేయొచ్చు గదా?' అని అడిగేసరికి నీళ్లు నమిలిండు. 'ఇగో, ముందుగాల్ల గీ టెస్టులైతే శేపిచ్చుకోని రా.. అప్పటిదాన్క ఈ మందులు వాడు' అని ఓ శిట్టీ శేతుల వెట్టిండు.

2026, జనవరి 31వ తేదీ శనారం సాయంత్రం నాలుగున్నర గొద్తున్నది. 'అన్నా.. ఓటీపీ శెప్తరా', అనడిగిన క్యాబ్ డ్రైవర్కు '1042' అన్జెప్పిన. ఆ క్యాబ్ డ్రైవర్ పేరు తాళ్లపల్లి అరుణ్ నేతకాని (ఎస్సీ). నలుగురు మనుషులతోని అల్కగ కల్సిపోయే నేను 'ఏమైంది తమ్మీ అట్లున్నవ్?' అని అరుణ్తోని గూడ మాటలు గల్పిన. ఊరు మీదున్న దరిద్రమంతా ఆయన మాటలల్లనే కనవడ్డది. అరుణ్ పన్నెండేండ్ల కిందటనే మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నుంచి హైదరావాద్కు వచ్చిండట. ఇప్పుడు సుమారు 30 ఏండ్లకుంటడు, ఇంకా పెండ్లి గాలె. కొద్దిసేపటి తర్వాత 'అన్నా.. నువ్వేం జేస్తవ్?' అని అరుణ్ గూడ నన్నడిగిండు. 'నేను జర్నలిస్టుని' అని శెప్పంగనే... 'అన్నా.. మొన్న పోలీసోళ్లు జర్నలిస్టులను ఎయిర్పోర్టులనే అరెస్టు జేసిన్రు ఎందుకే?' అని అడుగవట్టిండు. 'రాజ్యానికి బానిసలే కదా తమ్మీ ఈ పోలీసోళ్లు.. జర్నలిస్టులను అరెస్టు జేసుడు వాళ్లకో లెక్కనా?' అని అనేసరికి నవ్వవట్టిండు అరుణ్. ఎంబటే... 'పిచ్చోని చేతిల రాయి అయిందన్న తెలంగాణ' అని నవ్వవట్టిండు అరుణ్. 'ఎందుకు తమ్మీ ఒక్కసారి గంత మాటంటివి?'

"మా తాత (ఏదో పేరు శెప్పిండు గుర్తులేదు) పెద్ద పోరాట యోధుడు. ఇరువై ఎకరాల భూమి 2 ఎకరాలు జేసిండు. ఆయనకు నలుగురు కొడుకులు. ఆ నలుగురికి నపరో బాధున్నది. ఆ రెండెకరాల భూమి అమ్మితే గానీ ఆ బాధలు తీరేటివి కావు. ఆ రెండెకరాల భూమి అమ్ముదామని తిర్గితే కొనేటోడు దిక్కులేడిప్పుడు. రాక రాక ఒగడు ముందుకొస్తే అడ్డీకి పావుశేరు కింద అడుగుతున్నడు. మూడేండ్ల కింద రేటు మంచిగొచ్చింది. అప్పుడమ్మినా ఐపోవు. అత్యాశకు వొయ్యేసరికి అసలుకే మోసమొచ్చిందిప్పుడు? భూమి ధరలు ఇంకా పెరుగుతయని ఆశపడి ఆగినందుకు నోట్లె మన్నువడ్డదిప్పుడు.

ఇగ్గో నేను రొప్పుతున్న గీ కారు సూడు ఎట్లున్నదో.. ఎక్కడి వైర్లు అక్కడ తేలున్నయి. డోర్లు సక్కగ లెవ్వు? రోడ్డుపొంటి వోతా ఉంటే లొడా లొడా సప్పుడొస్తున్నది. రోడ్డుమీన మజ్జెన ఎక్కడాగు తదో ఎవ్వరికి తెల్వదు. కొత్తది కొనే ఐశత్ లేక దీనితోనే ఎల్లదీస్కుంటొస్తున్న. 'దళితబంధు' కింద రూ.12 లక్షలు ఇస్తమంటే నమ్మి మోసపోయినం. ఆ పైసలు వడ్తె కొత్త కారు కొందామని ఆశవడ్డ. ఆ పైసలు వడేది లేదు, నేను కొత్తకారు కొనేది లేదు. అవి పడ్తయన్న ఆశ గూడ ఇగిప్పుడు లేదు.

ఆడోళ్లకు బస్సు ఫ్రీ అయినంక మాకు కిరాయిలు తక్కువైనయి. మా కిరాయిల సంగతి పక్కనవెడ్తే... ఈ ఫ్రీ బస్సు మంచికి ఉపయోగపడితే మంచిగుండు. వాట్సాపుల ఒక వీడియో వచ్చింది. ఓ తల్లి తన బిడ్డకు అన్నం తినిపిచ్చేటందుకని బస్సెక్కిందట. ఎట్లయిపోయింది ఆర్టీసీ బస్సుల పరిస్థితి? అంతెందుకు మా ఇంట్లనే ఉన్నరు మా శెల్లెండ్లు. మా ఇద్దరు శెల్లెండ్లు సిటీలనే ప్రైవేటు కొల్వులు జేస్కుంటరు. శనారం పొద్దాకితే సాలు బస్టాండుకు వోతున్నరు, బస్సులెక్కుతున్నరు. గట్లెందుకు వోతున్నరనడిగితే సాలు ఫ్రీ బస్సేనాయె అని నన్ను నవ్వుతున్నరు. గీ గవర్నమెంటోళ్లు క్యాబ్ డ్రైవర్లకు నెలకు రూ.10 వేలు ఇస్తమన్నరు. 10 వేలు కాదు గదా, పది రూపాలు గూడ ఇస్తలేరు. మా ఇంకో శెల్లె (శిన్నబాపు బిడ్డ)కు పెండ్లి జేసి ఏడాదిన్నరయితున్నది. ఇప్పటికి కల్యాణలక్ష్మీ శెక్కు రాలేదు. ఆ శెక్కు రాంగనే లక్ష రూపాలిస్తమని మా బావకు మాటిచ్చినం. ఆ శెక్కు అచ్చుడులేదు, మేము మా బావకు పైసలిచ్చుడు లేదు. ఇప్పుడు మా బావ అలిగితే మా పరిస్థితి ఏంది? ఆ శెక్కు రాకున్న మంచిదే గనీ తులం బంగారమన్న ఇస్తె మంచిగుండు (నవ్వుకుంటా) బంగారం ఇప్పుడు తులం రెండు లక్షలైంది. మా ఇంకో అక్క పెండ్లి నాలుగున్నరేండ్ల కింద జేసినం. నెల తిరుగకముందే కల్యాణలక్ష్మీ పథకం కింద లక్షా నూట పదహారు రూపాయలు మా అకౌంట్ల వడ్డయి.

ఇగ గీ మచ్చట సూడు... మా నాయిన పేరు తాళ్లపెల్లి నారాయణ. ఆయన ఊళ్లో ఆటో నడుపుకుంటడు. సడుగుపొంటి ఆపి ఉన్న ఆటోను ఓ బోలేరో బండి వచ్చి గుద్దిపోయింది. పాపం ఉన్నకాన్నే కూలవడ్డడు బాపు. సూసినోళ్లు ఆయనను సక్కగ పట్నంలోని ఓ దవాఖానకు తీస్కొచ్చిన్రు. ఆయనను జూసిన డాక్టర్లు నారాయణది ఒక కాలిర్గింది. ఆపరేషన్ జేయాల్నన్నరు. అన్నట్టే ఆ డాక్టర్లు ఆపరేషన్ గూడ జేసిన్రు. అంతమంచిగనే అయిందనుకొని ఇంటికి పట్కవోయినం. పోయినంక మూడొద్దులకు ఆపరేషన్ జేసిన కుట్లల్లకెల్లి బొక్క బైటికి పీక్కచ్చింది. అయ్యను వట్టుకొని మల్లదే దవాఖానకు వోయినం. సావు కబురు సల్లగా జెప్పినట్టు 'మీ బాపు ఆపరేషన్ ఫేయిలైంది, మళ్ల ఆపరేషన్ జేసి పెద్ద రాడ్డెయ్యాలె' అని శెప్పవట్టిర్రు డాక్టర్లు. అయ్యను దవాఖాన్ల షరీఖ్ జేసి ఇగో గిట్ల రైడ్లు కొట్టుకుంటున్న. ఏం జేస్తమన్న నా కారు నడిస్తే గానీ నా కడుపు నిండదు మరి. అన్నా మీరు వెట్టిన లొకేషన్ వచ్చింది.""

**'అయ్యో తమ్మీ.. ఆ దవాఖాన కనవడ్తున్నది సూడు అక్కడావు..'**

**'ఆ సైనిక్పురి నుంచి ఈ అత్తాపూర్కు దాన్క వచ్చింది ఈ దవాఖాన కోసమేనా అన్న...'**

**'ఔను తమ్మీ... ఈ డాక్టర్ మంచోడని, విలువలు గల్ల మనిషి, ఉన్నదున్నట్టు శెప్తడ'ని ఓ పెద్దమనిషి శెప్పిండు. ఎందుకో నాకు వట్టిన పడిశం పోగొట్టేది ఈ డాక్టరేననిపిస్తున్నది తమ్మీ...'**

**'ఔనన్నా నీకు వట్టిన పడిశాన్ని వోగొట్టేది ఈ డాక్టరైతే.. మరి రాష్ట్రానికి వట్టిన పడిశాన్ని వోగొట్టేదెవ్వరే..?'**

**'ఇంకెవ్వలు తమ్మీ, మీరే..' 'నీ పడిశానికి మందు ఈ డాక్టర్ దగ్గరుంటే.. రాష్ట్రానికి వట్టిన పడిశానికి మందు మా దగ్గరే ఉన్నదన్నో..'**



**- గడ్డం సతీష్, 99590 59041**



# కలలోంచి పుట్టిన కళ

కలలు యాదృచ్ఛికమైనవని నమ్మడం మానేశాను. అవి అలసిపోయిన మెదడు అల్లిన అర్థరహితమైన చిత్రాలు కావు. అవి మన జ్ఞాపకాల, అనుభవాల భాండాగారాలు. మెలకువగా ఉన్నప్పుడు మనం ఆలోచించడానికి నిరాకరించిన విషయాలను అవి భద్రపరుస్తాయి. మనలను కదిలించిన కథల నుంచి దృశ్యాలను, ప్రదేశాలను, మనకు ఇష్టమైన వ్యక్తుల నుంచి స్వరాలను, సినిమాల నుంచి ముఖాలను అప్పుగా తీసుకుని పగలశీతా మనకు మనమే చెప్పుకోలేని కప్పబడిన సత్యాలను విప్పిచెప్పుతాయి. అలాంటి కలను నేనూ ఆస్వాదిస్తున్నా. అందుకోసమే మీతో పంచుకొనేందుకు సిద్ధమయ్యా. నేను మీతో పంచుకోబోయే కల 'అవతార్' సినిమా చూసిన తర్వాత వచ్చింది. నేను ఆ సినిమాను ఇటీవలి కాలంలో చూశాను. అత్యంత గాఢంగా లీనమై చూశాను. మనకి తెలియని మనలో ఉన్న గాయాన్ని తాకినప్పుడు ఎలా స్పందిస్తామో అలా చూసాను. అందుకే అది కలలా మారి, నా చేతి కళలా మీ ముందుకు వచ్చేసింది.

ఆ ప్రపంచంలో.. పండోర గ్రహంలో ప్రకృతి కేవలం నేపథ్యం కాదు. అది వారి ఉనికి, అస్తిత్వం. అక్కడ 'ఏవా' ఉంది. ఆమె ఆరాధనని ఆశించే దేవత కాదు. ఆమె సమస్తాన్ని అనుసంధానించే జైవిక ధాతువు, జీవ జ్ఞానం, మూలం. భూమి లోతుల్లోని వేర్లు, ఆకాశంలో విరుచుకుపడే రెక్కలు, నీటిలో ప్రవహించే జ్ఞాపకాలు, ఒక జీవితం మీద మరో జీవితం.. ఇలా అన్నిటినీ కలుపుతుంది. ఏవా ఎలాంటి తీర్పులు చెప్పదు. సమతుల్యతను కాపాడుతుంది. ఆ ప్రపంచంలోని జీవులు మరొక జీవితో అనుసంధానమయ్యే విధానం ప్రత్యేకం. జంతువులతో, చెట్లతో, ఒకరితో ఒకరు.. తమలో నుంచే విస్తరించే జీవబంధం ద్వారా కలుస్తారు. ఆ అనుసంధానంలో, కలయికలో దాచుకునే అవకాశం లేదు. కోరిక, భయం, లోభం, వినయం.. అన్నీ బయటపడతాయి. కలయిక శక్తి కాదు. అది లొంగిపోవడం. బహుశా నా మనసు ఈ ఆలోచనలతో నిద్రలోకి జారుకుంది మెల్లిగా..!

నా మనసులో ఒక బీచ్ పుట్టింది. నేను ఆ సముద్ర తీరంలో ఉన్నాను. కాలమే అక్కడ విశ్రాంతి తీసుకున్నదా అన్నట్లుగా ఇసుక అంతులేని విధంగా విస్తరించి ఉంది. సముద్రం మృదువుగా కదులుతోంది. ప్రతి అల ఒక ఆలోచనలా జాగ్రత్తగా చేరువగా వస్తుంది. హారిజన్ మన వైపుకి పరుగున రావడం లేదు. బదులుగా ఎదురు చూస్తోంది. ఆ మరో ప్రపంచంలో.. పండోరా నుంచి వచ్చిన నావి ప్రజలు నా పక్కనే నడుస్తున్నారు. ఎత్తైన వారు, నీలివర్ణం, ప్రశాంతమైన చూపు. నేతిరి నా దగ్గరగా నడిచింది. ఆమె బీచ్ మీద నడిచినట్లుగా రాలేదు. బీచ్‌తో కలిసి వచ్చింది, ఇసుక అస్తిత్వాన్ని కూడా గుర్తించి గౌరవిస్తూ.. లో'ఆక్, జేక్ ఇద్దరు బీచ్‌లో ముందుకు పరిగెత్తారు. ఎవరిని ఉద్దేశించి ఏ ప్రశ్నలు అడుగకుండానే జీవం ఉట్టిపడేలా స్వేచ్ఛ గా కదులుతున్నారు. ఇతరు జీవులు వాళ్ళ ఊహల్లో వారు ఊరేగుతూ వచ్చి వెళ్లిపోయారు. పేరు పెట్టలేని, అనుభూతి మాత్రమే చెందే ఊహలు, అనుభూతులు అవి.

స్పైడీ కూడా అక్కడే ఉన్నాడు. మేము అందరం ఎంతో సంతోషంగా ఉన్నాం. మా వేడుకకి రుజువు కోరుకునే ఆనందం కాదు అది. వివరణ అవసరం లేని నిశ్శబ్ద ఆనందం.



మేము నడుస్తూ పోయాం. మేము నవ్వుకున్నాం. ఎక్కడా భద్రపరుపచుకునే అవసరం లేని ఫోటోలు దిగినం. గాలి మా ఉనికిని గమనించింది, కానీ కలత చెందలేదు. వారు నా వెంట ఉన్నారు. కలలకు ఎన్నో విశ్వాలు అవసరం లేదు. వాటికి అర్థం కావాలి. అయితే ఆ సౌహార్థ్యంలో కూడా నాలో ఏదో అసంపూర్తిగా అనిపించింది. అప్పుడే నేను దాన్ని చూశాను. బీచ్ పచ్చదనశీతో కలిసే చోట ఒక నెమలి నిల్చొని ఉంది. అది కదలలేదు. కదలాల్సిన అవసరం కూడా లేదు దానికి. దాని ఉనికే చాలు. సూర్యకాంతి దాని మెడను తాకి నీలిని పురాతనంగా, పవిత్రంగా మార్చింది. నాలో ఒక కోరిక మెల్లగా వెలువడింది. అది హింసాత్మకమైనది కాదు. భయంకరమైన కోరిక కూడా కాదు. నాకు తెలిసిన చిన్న కోరిక. ఒక నెమలీక కావాలని. అంతే..! అది కూడా ఒక్కటే ఒక ఈక ఇంటికి తీసుకెళ్లడానికి. అది కూడా ఎందుకో నాకు తెలియదు. నిజానికి నాకు నేనే పూర్తిగా అర్థం కాలేదు. నా స్నేహితులలో చాలామందికి నెమలి ఈకలు ఉన్నాయి. అవి అదృష్టానికి, అందానికి గుర్తులు. అపురూపమైన దానిని తాకినట్లు, మన సొంతం అయినట్లు దానిని కలిగి ఉండడం అనే గొప్పతనానికి ఒక ఆధారం నెమలీక. నేను అలా అడగడంతో నేతిరి ఆగింది. కోపంతో కాదు.. అంతకంటే భారమైన భావంతో నన్ను చూసింది. 'మా ప్రపంచంలో' ఆమె మృదువుగా చెప్పింది. 'కోరిక కల్గి ఉండటం సరైన లక్షణం, సరైన హేతువు కాదు' అని. నేను రక్షణాత్మకంగా స్పందించాను. 'నా కోరికతో ఎవరికి హాని కాదు, ఒక్క నెమలీక మాత్రమే' అని అన్నాన్నేను. నేను ఆమెను నెమలితో నాడీబంధం ఏర్పరచుకొని మృదువుగా ఒక ఈక అడగాలని కోరా. ఆమె వాదించలేదు. బదులుగా నా ముందు మోకరిల్లింది. ఏవాను ఆశ్రయించింది. ఆ ప్రపంచంలో కలయిక ఒక పవిత్ర బంధం. వారు ఏర్పరుచుకునే నాడీబంధం ఎదుటివారిని ఆదేశించడానికి కాదు, అర్థం చేసుకోవడానికి మాత్రమే.

**నేను మర్చిపోయాను.. నేతిరి క్షమాపణ పూర్వకంగా!**
**అనుసంధానం అనుమతి కాదు.. నెమలి కదిలిపోతూ!!**

అనుసంధానమైతే జ్ఞాపకాలు నీటి వలే ప్రవహిస్తాయి. వేదన పంచుకుంటుంది. భావాలు దాగలేవు. నేతిరి వేర్లకు, శ్వాసకు, చరిత్రకు సంబంధించిన ప్రార్థన చేసింది. అప్పుడు నెమలితో అనుసంధానమైంది. సంయోగం చెందినది. ఆ కలయికతో, గాలి గాఢతని పొంది ఘనంగా మారింది. నెమలి మృదుత్వం పొందింది. మార్ధవం ఆ చూపుల్లో. దాని శరీరం విశ్రాంతి పొందింది. అది మాట్లాడినప్పుడు ఆ స్వరం పలుకులా లేదు.. దయతో నిండి ఉంది. 'అడవి బిడ్డా ! ఎదుటివారిని ఆక్రమించుకోకుండా, దోచుకోకుండా ఎలా మసలుకోవాలి అనేది నీవింకా గుర్తుపెట్టుకున్నావు' అని. నేతిరి ముఖంలో ఉపశమనం మెరిసింది. మెల్లిగా గౌరవంగా అడిగింది: 'ఒక ఈక తీసుకోవచ్చునా?' అని. ఆ తరువాత వచ్చిన నిశ్శబ్దం కేవలం ఖాళీ కాదు. నెమలి కళ్ళు ఎరుపెక్కాయి. గాలిలోకి చూసింది. కోపం మాత్రమే కాదు.. చాలాకాలంగా ఎదురుచూసిన విషాదం. 'ఒక ఈకనా? మీరు ఎప్పుడూ ఒకటి అనే అంటారు. మీరు పరుషంగా నాశనం చేయరు. మృదువుగా చేస్తారు. 'అనుమతితో, నెపాలతో.. ఇది నాకు నొప్పి కలుగదు అని అంటారు.. కానీ, హాని అనేది రక్తంతోనే కొలవడం కాదు. జీవితం అలంకారంగా , ఆడంబరంగా మారినప్పుడు హాని జరుగుతుంది' అంటూ నేతిరి వైపు తిరిగింది. 'నీవు ఏవాతో అనుసంధానమవుతావు, కానీ మనిషి కోరిక నీ ఆలోచనలోకి వచ్చిన క్షణంలో ఆమెను మర్చిపోతావు' అంటుంటే నేతిరి వణికింది. 'నా ఉద్దేశం అలా కాదు..' అని నేతిరి ఏదో చెప్పాలని ప్రయత్నించింది. 'ఉద్దేశాలు అంతరించిపోవడాన్ని ఆపలేవు' అని నెమలి అడ్డుకుంది. 'నువ్వు మనుషుల దురాశాలకు లోబడి ఉంటే ఇది ఇంకా భూమే అవుతుందా? నా లాంటి జీవులు ఇకపై జ్ఞాపకాలలో మాత్రమే మిగిలిపోవా? వాయువు మనుషులు తెలివిగా ఆడే అబద్ధాలతో బరువెక్కింది. మీరు అడవులని నరికి ప్రార్థిస్తారు. నదులను విషపూరితం చేసి అవే నీళ్లలో పాపాలు కడుగుతారు. మూల జాతులను అంతం చేసి దేవతలుగా పూజిస్తారు. వాటిపై కవితలు రాస్తారు, ఆందోళనలు చేస్తారు. ఏవాను తేలికగా తీసుకోకండి. ఆమె అనంతం కాదు. ఆమెకి సహనం ఉంది. అది అంతం లేనిది కాదు' అంటుంటే నేతిరి కుప్ప కూలిపోయింది. ఇసుకను కన్నీళ్లతో తడిపింది.

ఇది అంతా నా కళ్ళ ముందు చూస్తుంటే నాలో ఏదో బద్దలైపోయింది. నా అంతరంగాన్ని స్పష్టంగా చూసుకున్నాను. అది చెడ్డది కాదు. క్రూరమైంది కాదు, కేవలం ఒక మనిషిని. అందాన్ని రక్షించకుండా దానిని సొంతం చేసుకోవాలనుకునే మనిషిని. బాధ్యతకన్నా ఆడంబరం, ఆధారం కోరుకునే దానిని. ఈ కల నాకు ఇచ్చింది అదే. అప్పుడు నాకు మరో రకం కలలు గుర్తొచ్చాయి. అవి నా కలలు కాదు, జపాన్ సినిమా దర్శకుడు అకిరా కురోసావా సినిమా 'డ్రీమ్స్'లో చూసినవి. జీవితాన్ని, ఋతువులను, మనుషులను, ప్రకృతిని గమనించిన మనిషి ఊహించిన ప్రపంచం. ఆ సినిమాలో చివరి కథ.. 'నీళ్ల మిల్లులున్న గ్రామశీ'. ఇప్పటికీ నన్ను వెంటాడుతోంది. విద్యుత్ వెలుగులను తిరస్కరించిన గ్రామం అది. రాత్రులు చీకటిగానే ఉండాలి. నదులు అడ్డంకులు లేకుండా ప్రవహించాలి. మనుషులు అన్నింటినీ తమదని ప్రకటించకుండాముందుకు సాగాలి. ఆ కలలలో చీకటిగా ఉండడం లోపం కాదు. దానికి తనదైన బరువు ఉంది. గాఢత ఉంది. లయ ఉంది. సహనం ఉంది. గౌరవం ఉంది. జీవితం ఎప్పుడూ సరిదిద్దాల్సిన అవసరం లేదని అది గుర్తు చేస్తుంది. ఆ నెమలీక కూడా అలాగే అనిపించింది. అది నాది కావాల్సిన అవసరం లేదు. అది ఉన్నది ఉన్నట్లుగా ఉండటమే సరైనది. దానిని తీసుకోవాలనే నా మర్యాదపూరితమైన, చిన్న కోరిక.. నేను భారంగా మోస్తున్న అలవాటును బయటపెట్టింది. మనమంతా ఇప్పుడు మోస్తున్న అలవాటు అది. అందాన్ని ఒక ఆధారంగా మార్చడం, ఆరాధనను స్వాధీనంగా మార్చడం, ఉనికిని యాజమాన్యంగా మార్చడం. మనం ఏదీ సేకరించకుండా, దోపిడి చేయకుండా ఉండనివ్వని కాలంలో జీవిస్తున్నాం. అన్నింటినీ ఫోటో తీస్తాం. అన్నింటినీ పంచుకుంటాం. అన్నింటిని లిఖితం చేసి బహిర్గతం చేస్తాం. ప్రదర్శిస్తాం. స్వాధీనం చేసుకుంటాం. నిశ్శబ్దాన్ని కూడా బంధిస్తాం. రాత్రినీ వెలిగిస్తాం. నదులు, అడవులు, జంతువులు.. అన్నీ మన కోసం ఆటలు ఆడాల్సిందే.

- ఇట్యాల శాన్విత భారతి
9908198484



ఈ కల నుంచి నేను సినిమా తీస్తే.. నెమలి మాట్లాడకపోవచ్చు. ఈక కింద పడకపోవచ్చు. కెమెరా కదలకుండా ఉండొచ్చు. అదే ఈ కలను కురోసావా కలలకు దగ్గర చేస్తుంది. ఎప్పటికప్పుడు వెలుగుకన్నా చీకటిని ఎంచుకున్న గ్రామాల కథలకు. వారు అభివృద్ధిని తిరస్కరించలేదు. బహుశా జ్ఞానం అంటే చీకటిపై వెలుగును ఎంచుకోవడం కాదు, మనిషిని ప్రకృతిపై ఎంచుకోవడం కాదు, కోరికను నియంత్రణపై ఎంచుకోవడం కాదు. ఎక్కడ ఆగాలో నేర్చుకోవడం. ఉనికే సరిపోతుందనే స్థలాన్ని గుర్తించడం. ఆరాధనకు ఆధారం అవసరం లేదని తెలుసుకోవడం. చూడకపోవడం, తాకకపోవడం, సొంతం చేసుకోకపోవడం అనేది అత్యంత గౌరవప్రదమైన చర్య అని అర్థం చేసుకోవడం. ఆ సినిమా సంగీతంతో, అంత్యక్రియతో ముగుస్తుంది. మరణాన్ని ప్రకృతి భాగంగా అంగీకరిస్తుంది.. దాచకుండా, శుభ్రపరచకుండా. రాత్రులు రాత్రులుగానే చీకటిగా ఉండాలి. ఈకలు అలాగే ఉండాలి.



**కురోసావా కలలు అడిగాయి: రాత్రిని ఎందుకు వెలిగించాలి? అని**
**నా కల అడిగింది: ఈకను ఎందుకు తీసుకోవాలి? అని**
**ఈ కలలో ఏదీ హింసాత్మకం కాదు.**

అది ఆరాధనతో మొదలై, స్వాధీనంతో కొనసాగి, అంతరించడంతో ముగుస్తుంది. నాది మాత్రం అలా కాదు. నా కలలో నేను ముందుకు నడిచాను. నేను మోకాళ్ళపై కూలిపోయి క్షమాపణ చెప్పాను. గాలి తిరిగొచ్చింది. నెమలి చూపు మృదువైంది. మా కోసం కాదు.. ఆకాశం కోసం రెక్కలు విప్పింది. ఏ ఈక పడలేదు. అప్పుడే.. టిక్.. టిక్.. టిక్.. అవసరం లేని, హింసాత్మక శబ్దం గాలిని చీల్చింది. బీచ్ ఛిద్రమైంది. ఏవా జారిపోతూ మాయమైంది. నేను లేచాను. మా డాడీ ఉదయపు పూట ప్రకృతి సహజరీతికి విరుద్ధంగా ఫోన్‌లో పూర్తి శబ్దంతో యథాలాపంగా వీడియోలు చూస్తున్నాడు. ఆ సమయశీలో ఏదో అత్యవసరమని రుజువు చేయాలనుకున్నట్టుగా. నేను అసహనంతో, కోపంతో, విషాదంతో లేచి కూర్చున్నాను. కల ముగిసింది. విశ్వం ముగిసింది. కానీ ఏదో మిగిలి ఉంది. మళ్లీ అదే కల వస్తే అది బీచ్‌లో మొదలవదు. అది కదలికతో మొదలవుతుంది. నేను ఎక్కడున్నానో అర్థమయ్యేలోపు ప్రజలు కదులుతుంటారు. నెమలి అక్కడే ఉంటుంది. అలక్ష్యంగా కాదు, శాంతంగా గమనిస్తూ. కలలు అంతరాయం చెందవచ్చు. కానీ పాఠాలు మౌనంగా వెళ్లిపోవు. అందుకే నేను ఇది రాస్తున్నాను. ఎందుకంటే – కొన్ని నెమలీకలు తీసుకోవడానికి కాదు. అవి అర్థం చేసుకోవడానికి మాత్రమే.





# ఉత్తరాంధ్ర బీజేపీ యూత్ వింగ్ అధ్యక్షుడిగా కే ఏ నాయుడు

వైజాగ్, ఫిబ్రవరి 1 (ఈవార్తలు): భారతీయ జనతాపార్టీ ఉత్తరాంధ్ర యూత్ వింగ్ జోనల్ ఇన్ ఛార్జిగా కొంచాడ ఎరుకునాయుడుని నియమిస్తూ ఆ పార్టీ అధికారిక ఉత్వర్వుల ద్వారా వెల్లడించింది. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు జారిచేసింది. పార్టీకి చేస్తున్న కృషిని గుర్తించిన భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు పీవీఎన్ మాదవ్ సిఫార్సు మేరకు యువమోర్చ రాష్ట్ర అధ్యక్షులు సునీల్ రెడ్డి ప్రకటన విడుదల చేశారు. దశాబ్దానికి పైగా పార్టీలో క్రియాశీలకంగా ఉంటూ వస్తోన్న నాయుడు పార్టీ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చురుక్కా ప్రజల వద్ధకు చేరవేస్తుంటారు. శ్రీకాకాళం జిల్లా ఆముదాలవలస నియోజకవర్గం ఇల్లయ్యగారిపేటకు చెందిన ఎరుకు నాయుడు జాతీయ భావాల కలిగిన వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్నారు. భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలకు, ప్రధాని మోదీ నాయకత్వానికి ఆకర్షితుడై పార్టీకోసం ఎనలేని కృషి చేస్తున్నారు. ఇంతకు ముందు విశాఖ పట్నం జిల్లా పార్టీ ఉపాధ్యక్షునిగా, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ గానూ పనిచేసిన అనుభవం ఉంది. ఉత్తరాంధ్ర సంస్కృతిక పరిరక్షణ వేదిక ఫౌండర్ ప్రెసిడెంట్‌గానూ పనిచేశారు. న్యాయవాదుల సంఘం కార్యనిర్వాహణ సభ్యునిగా ఇలా వివిధ హోదాల్లో ఎరుకునాయుడు పనిచేశారు. మొదటి నుంచి ప్రజాప్రయోజనాలు కోసం పనిచేస్తూ వస్తున్న ఎరుకునాయుడికి భారతీయ జనతాపార్టీ ఉత్తరాంధ్ర యూత్ వింగ్ జోనల్ ఇన్ ఛార్జిగా అవకాశం రావడం పట్ల శ్రేయోభిలాషులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.



# జగిత్యాల జిల్లాలో 37 మశీది బాల కార్మికులకు విముక్తి

**జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ వెల్లడి**

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 1 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో 37 మంది బాల కార్మికులకు విముక్తి కల్పించినట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి సంవత్సరంలో రెండు సార్లు ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహించామని అన్నారు. తప్పిపోయిన బాలలను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చడానికి జిల్లావ్యాప్తంగా ఆపరేషన్ స్మైల్ చేపట్టామని చెప్పారు. ఒక్కో సబ్ డివిజన్ పరిధిలో ఒక సబ్- ఇన్స్ పెక్టర్, ముగ్గురు కానిస్టేబుల్స్,ఒక మహిళ కానిస్టేబుల్ ను ప్రత్యేకంగా కేటాయించి చైల్డ్ లైన్ తో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాది జనవరి 1 నుండి 31 వరకు ఆపరేషన్ స్మైల్-11 కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. 18 సంవత్సరాలలోపు ఉన్న పిల్లలతో పని చేయిస్తున్న వారిపై ఐదు కేసులు నమోదు చేశామని వెల్లడించారు.

# బయోఫార్మాకు రూ.10,000 కోట్లు

## ఆరోగ్య శాఖకు 10% అధిక నిధులు

న్యూఢిల్లీ: దేశ ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం, అన్ని రంగాల్లో ఉద్యోగాల కల్పనను ప్రోత్సహించడమే లక్ష్యంగా 2026-27 కేంద్ర బడ్జెట్‌ను రూపొందించినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. నేడు బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ బడ్జెట్.. "సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్" స్ఫూర్తితో 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు మార్గం సుగమం చేస్తుందని ఆమె అన్నారు. పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు వంటి ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలకు బడ్జెట్‌లో ప్రత్యేక ప్రాధాన్యత ఎందుకు ఇవ్వలేదని విలేకరులు అడిగిన ప్రశ్నకు, నిర్మలా సీతారామన్ చమత్కరిస్తూ.. "ప్రభుత్వం ఏ మార్గంలో వెళ్లినా విమర్శలు తప్పవు కదా" అని సమాధానమిచ్చారు. ఈ బడ్జెట్ కేవలం కేటాయింపులకు పరిమితం కాలేదని, దేశ ఉత్పాదకతను పెంచేందుకు నిర్మాణాత్మక సంస్కరణలతో కూడిన ఒక పటిష్టమైన వ్యవస్థను నిర్మించడంపై దృష్టి సారించిందని నిర్మలా సీతారామన్ వివరించారు. "స్థిరమైన ఆర్థిక విస్తరణ ద్వారా వృద్ధి వేగాన్ని కొనసాగించేలా ఈ బడ్జెట్‌ను తీర్చిదిద్దాం. టెక్నాలజీ ఆధారిత, సమ్మిళిత ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించాలన్న ప్రభుత్వ నిబద్ధత ఇందులో ప్రతిబింబిస్తుంది," అని ఆమె తెలిపారు. బడ్జెట్‌లోని కీలక ప్రతిపాదనలను వివరిస్తూ, బయోఫార్మా రంగంలో భారత్ తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకునేందుకు రాబోయే ఐదేళ్లలో రూ.10,000 కోట్లు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. ఇది ఈ రంగంలో మన దేశ నాయకత్వాన్ని సుస్థిరపరుస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా, ఈసారి



బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి కూడా సమాన ప్రాధాన్యత ఇచ్చామని, ముఖ్యంగా మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు కేటాయింపులను గత ఆర్థిక సంవత్సరం (2025-26) సవరించిన అంచనాల కంటే దాదాపు 10 శాతం పెంచి రూ.1,06,530.42 కోట్లకు చేర్చినట్లు తెలిపారు. ఆరోగ్య రంగంలో మానవ వనరులను బలోపేతం చేసేందుకు రాబోయే ఐదేళ్లలో ఆప్టోమెట్రీ, రేడియాలజీ, అనస్థీషియా వంటి 10 విభాగాల్లో లక్ష మంది అనుబంధ ఆరోగ్య నిపుణులను తీర్చిదిద్దనున్నట్లు ప్రకటించారు. దీంతో పాటు, దేశవ్యాప్తంగా మరిన్ని అత్యవసర, ట్రామా సెంటర్లు, నిమ్హాన్స్ వంటి మానసిక ఆరోగ్య సంస్థలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వృద్ధుల సంరక్షణ కోసం 1.5 లక్షల మంది కేర్‌గివర్లను కూడా సిద్ధం చేయనున్నట్లు చెప్పారు. బడ్జెట్‌లో కొత్తగా ప్రతిపాదించిన రేర్ ఎర్త్ కారిడార్ల విజయంపై ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో ఏర్పాటు చేసిన డిఫెన్స్ కారిడార్ల విజయాన్ని ఈ సందర్భంగా ఉదాహరణగా చూపారు.

# వాస్తవాలను విస్మరించారు



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్‌పై విపక్షాలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాయి. దేశం ఎదుర్కొంటున్న వాస్తవ ఆర్థిక, సామాజిక సవాళ్లను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. నిరుద్యోగం, తయారీ రంగం క్షీణత, రైతుల కష్టాలు వంటి కీలక సమస్యలను పరిష్కరించడంలో ఈ బడ్జెట్ ఘోరంగా విఫలమైందని ఆయన ఆదివారం విమర్శించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా రాహుల్ గాంధీ స్పందించారు. "ఉద్యోగాలు లేని యువత, పడిపోతున్న తయారీ రంగం, దేశం నుంచి తరలిపోతున్న పెట్టుబడులు, కుప్పకూలుతున్న కుటుంబ పొదుపు, రైతుల కష్టాలు, పొంచివున్న ప్రపంచ ఆర్థిక సంక్షోభాలు... వీటన్నింటినీ బడ్జెట్ పట్టించుకోలేదు. దిద్దుబాటు చర్యలకు నిరాకరిస్తున్న ఈ బడ్జెట్, భారతదేశ వాస్తవ సంక్షోభాల పట్ల గుడ్డిగా వ్యవహరిస్తోంది" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

# సంస్కరణల ఎక్స్‌ప్రెస్: ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేడు పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2026-27 కేంద్ర బడ్జెట్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. ఈ బడ్జెట్‌ను 'అద్భుత అవకాశాల రహదారి'గా అభివర్ణించారు. ఈ బడ్జెట్ ద్వారా భారతదేశం ప్రయాణిస్తున్న 'సంస్కరణల ఎక్స్‌ప్రెస్'కు కొత్త శక్తి, ఊపు లభిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దేశ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ, భవిష్యత్ తరాలకు బలమైన పునాది వేసేలా ఈ బడ్జెట్ ఉందని ఆయన అన్నారు. ఈ బడ్జెట్ చారిత్రాత్మకమైనదని, ఇది భారత 'నారీ శక్తి'కి బలమైన ప్రతిబింబమని ప్రధాని అన్నారు. "మహిళా ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టి రికార్డు సృష్టించారు" అని ఆయన కొనియాడారు. ప్రస్తుత కలలను వాస్తవంగా మార్చి, 2047 నాటికి వికసిత భారత్ సంకల్పాన్ని సాధించే దిశగా దేశం వేగంగా దూసుకెళ్లేందుకు ఈ బడ్జెట్ బలమైన పునాది వేస్తుందని మోదీ తెలిపారు. "ఈ బడ్జెట్ చాలా ప్రత్యేకమైనది. అధిక మూలధన వ్యయం, అధిక వృద్ధికి ప్రాధాన్యత ఇస్తూనే, ద్రవ్య లోటును తగ్గించడం, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడంపై దృష్టి సారిస్తుంది. కేవలం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఉండటంతోనే 140 కోట్ల మంది భారతీయులు సంతృప్తి చెందరు, త్వరలోనే ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాలని మేం లక్ష్యంగా పెట్టుకున్నాం" అని ఆయన స్పష్టం చేశారు. ఈ బడ్జెట్ 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' మిషన్లను వేగవంతం చేయడానికి సాహసోపేతమైన దార్శనికతను అందించిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# కడప జిల్లాలో 227 గన్ లైసెన్సులు రద్దు

కడప, ఫిబ్రవరి 1 (ఈవార్తలు): ఏపీలో గత ప్రభుత్వ హయాంలో వైఎస్ఆర్ కడప జిల్లాలో ఇష్టానుసారంగా జారీ చేసిన గన్ లైసెన్సులపై అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. ఎర్రచందనం స్మగ్లర్లు, కబ్జాదారులు, కిరాయి రౌడీలు, గూండాలకు లైసెన్స్‌లు ఇచ్చినట్లు ఆరోపణలు రావడంతో సమగ్ర విచారణ చేపట్టి, 227 తుపాకీ లైసెన్స్‌లను ఉన్నతాధికారులు రద్దు చేశారు. లైసెన్స్‌లు పొందిన కొందరు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడ్డారని, తుపాకులు చూపిస్తూ బెదిరింపులు, దౌర్జన్యాలకు దిగారని ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ విషయం మీడియాలో రావడంతో ప్రత్యేక పోలీసు బృందాలను నియమించి, జిల్లాలో జారీ చేసిన మొత్తం 854 తుపాకీ లైసెన్స్‌లను సమగ్రంగా పరిశీలించారు. అర్హతలేమి, నేరపూరిత నేపథ్యం ఉన్నవారికి లైసెన్స్‌లు ఇచ్చారా అనే అంశాలపై విచారణ జరిపారు. ఈ విచారణలో దాదాపు 227 మంది లైసెన్స్‌దారులు వివిధ నేరాల్లో పాల్గొన్నట్లు తేలింది. వారిలో 11 మంది కరుడుగట్టిన నేరస్తులుగా గుర్తించగా, మరో ముగ్గురు నిబంధనలు ఉల్లంఘించి తుపాకులతో నేరాలకు పాల్పడ్డట్లు గుర్తించారు. దీంతో 227 గన్ లైసెన్స్‌లను రద్దు చేయాలని జిల్లా కలెక్టర్‌కు ఎస్పీ సిఫార్సు చేయగా, కలెక్టర్ నిన్న ఉత్తర్వులు జారీ చేశారు. తుపాకీ లైసెన్స్‌లు రద్దయినవారిలో జమ్మలమడుగుకు చెందిన వైసీపీ నేత మల్కిరెడ్డి హనుమంతరెడ్డి, పులివెందులలో కాల్పుల ఘటనలో ఉన్న భరత్ యాదవ్, వీరపునాయునిపల్లె మండలం పాయసంపల్లెకు చెందిన నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. అలాగే కమలాపురం మండలం అప్పాయపల్లి గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ ఎం. శ్రీనివాసులరెడ్డి, కడప పట్టణం ఎస్‌బీఐ కాలనీకి చెందిన షేక్ జాకీర్ లైసెన్స్‌లను కూడా రద్దు చేశారు. పులివెందుల, కడప, జమ్మలమడుగు నియోజకవర్గాల్లో ఎక్కువ సంఖ్యలో తుపాకీ లైసెన్స్‌లు రద్దయినట్లు తెలుస్తోంది.

# జనవరిలో మహీంద్రా జోరు

## రికార్డు స్థాయి అమ్మకాలు.. 24 శాతం వృద్ధి

### 1.04 లక్షల వాహనాల విక్రయం

న్యూఢిల్లీ: ప్రముఖ ఆటోమొబైల్ తయారీ సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రా (ఎండఎం) 2026 సంవత్సరాన్ని అమ్మకాల వృద్ధితో ఘనంగా ప్రారంభించింది. ఈ ఏడాది జనవరిలో ఎగుమతులతో కలిపి కంపెనీ మొత్తం 1,04,309 వాహనాలను విక్రయించింది. గతేడాది జనవరితో పోలిస్తే ఇది 24 శాతం అధికమని సంస్థ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. వివరాల్లోకి వెళ్తే, స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్ (ఎస్‌యూవీ) సెగ్మెంట్‌లో కంపెనీ తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. దేశీయంగా ఎస్‌యూవీ అమ్మకాలు 25 శాతం వృద్ధితో 63,510 యూనిట్లుగా నమోదయ్యాయి. అదే సమయంలో, వాణిజ్య వాహనాల విక్రయాలు 22 శాతం పెరిగి 27,656 యూనిట్లకు చేరుకున్నాయి. జనవరిలో ఎగుమతులు 5 శాతం వృద్ధితో 3,577 వాహనాలుగా ఉన్నాయి. ఈ అమ్మకాలపై ఎండఎం ఆటోమోటివ్ డివిజన్ సీఈఓ నళినీకాంత్ గొల్లగుంట మాట్లాడుతూ.. "గత సంవత్సరం సాధించిన ఊపును కొనసాగిస్తూ ఈ ఏడాదిని బలంగా ప్రారంభించాం. జనవరి 14న ప్రారంభించిన ఎక్స్‌యూవీ7ఎక్స్‌ఓ, ఎక్స్‌ఈవీ 9ఎస్ మోడళ్లకు కేవలం 4 గంటల్లోనే రూ. 20,500 కోట్ల విలువైన 93,689 బుకింగ్స్ రావడం ఒక రికార్డు" అని వివరించారు. ఇతర విభాగాల్లోనూ కంపెనీ మంచి పనితీరు కనబరిచింది. త్రీ-వీలర్ అమ్మకాలు 28 శాతం పెరిగి 9,566 యూనిట్లకు చేరాయి. తేలికపాటి వాణిజ్య వాహనాల (ఎల్‌సీవీ) విక్రయాలు కూడా 23 శాతం వృద్ధిని నమోదు చేశాయి. డిసెంబర్ 2025లో కూడా కంపెనీ రికార్డు స్థాయిలో అమ్మకాలు జరిపింది. ఈ గణాంకాలు తమ ఎస్‌యూవీ-ఆధారిత వ్యూహం విజయవంతం కావడానికి, కస్టమర్లలో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని సంస్థ పేర్కొంది.



# జగిత్యాల మ్యాంగో మార్కెట్‌లో 7న పోలింగ్

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 1 (ఈవార్తలు): జగిత్యాల మ్యాంగో కమీషన్ ఏజెంట్స్ 2026-28 సంబలకు జరిగే అధ్యక్ష, జనరల్ సెక్రటరీ, కోశాధికారి పదవులకు ఈ నెల 7న ఎన్నికలు నిర్వహించనున్నట్లు సభ్యులు కే శ్రీనివాస్, ఎండీ హసీద్, ఎండీ రఫీ తెలిపారు. మ్యాంగో మార్కెట్ వద్ద జరిగే ఈ పోలింగ్ కోసం 4వ తేదీన నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. పోలింగ్ రోజునే మధ్యాహ్నం 2 గంటలకు ఫలితాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.

# సిగరెట్లు, పాన్ మసాలా ప్రియం

దేశంలో 'సిన్ గూడ్స్'గా పిలిచే పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించడమే లక్ష్యంగా కేంద్రం కొత్త పన్నుల నియమావళిని అమల్లోకి తెచ్చింది. ఇప్పటివరకు ఉన్న 28 శాతం జీఎస్టీ ప్లస్ కాంపెన్సేషన్ సెస్ స్థానంలో.. ఇప్పుడు 40 శాతం జీఎస్టీతో పాటు అదనపు ఎక్సైజ్ డ్యూటీ, హెల్త్ సెస్ విధిస్తున్నారు. దీనివల్ల సిగరెట్ల ధరలు 15 నుంచి 40 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. సిగరెట్ పొడవు, ఫిల్టర్ రకాన్ని బట్టి పన్నులను ఖరారు చేశారు, 65 మి.మీ లోపు (నాన్-ఫిల్టర్) ఒక్కో సిగరెట్‌పై రూ. 2.05 అదనపు డ్యూటీ, 65 మి.మీ లోపు (ఫిల్టర్) ఒక్కో



సిగరెట్‌పై రూ. 2.10 అదనపు డ్యూటీ, మీడియం (65-70 మి.మీ) ఒక్కో స్టిక్‌పై సుమారు రూ. 4 వరకు పెంచారు. అలాగే, ప్రీమియం/లాంగ్ (70-75 మి.మీ) ఒక్కో స్టిక్‌పై రూ. 5.40 వరకు భారం పడనుంది. కొన్ని కేటగిరీల్లో 1000 సిగరెట్లపై రూ. 8,500 నుంచి రూ. 11,000 వరకు ఎక్సైజ్ డ్యూటీ పడనుంది. పాన్ మసాలా, గుట్కా తయారీదారులు ఇకపై తమ ప్యాకింగ్ మెషీన్ల సామర్థ్యం ఆధారంగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అంతేకాకుండా, తయారీ కేంద్రాల్లో తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాలు, ఏర్పాటు చేసి ఆ ఫుటేజీని 24 నెలల పాటు భద్రపరచాలని ప్రభుత్వం ఆదేశించింది. పచ్చి పొగాకుపై 60-70 శాతం, ఈ-సిగరెట్లపై 100 శాతం పన్ను విధించడం ద్వారా ప్రభుత్వం తన కఠిన వైఖరిని స్పష్టం చేసింది. ధరలు పెంచడం ద్వారా ప్రజలు ధూమపానానికి దూరమవుతారని ప్రభుత్వం భావిస్తుండగా, నిపుణులు మాత్రం భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. పన్నులు మరీ ఎక్కువగా ఉంటే, ప్రజలు చౌకగా దొరికే స్మగ్లింగ్ సిగరెట్లు లేదా నకిలీ ఉత్పత్తుల వైపు మళ్లే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

# రైతుల బడ్జెట్




**అధిక దిగుబడి పంటలకు ప్రోత్సాహం**

**కొబ్బరి ఉత్పత్తి పెంపునకు ప్రత్యేక తోడ్పాటు**

**500 రిజర్వాయర్లలో చేపల పెంపకానికి నిర్ణయం**

**పశు సంవర్ధక శాఖకూ భారీ ప్రోత్సాహకాలు**

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్ లో చిన్న, సన్నకారు రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రాధాన్యమిచ్చామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. అధిక దిగుబడి ఇచ్చే పంటలతో పాటు అధిక విలువైన పంటల దిశగా రైతులను ప్రోత్సహిస్తామని తెలిపారు. కొబ్బరి ఉత్పత్తి పెంపునకు ప్రత్యేక ప్రోత్సాహక పథకం.. కాయలు కాయని చెట్ల స్థానంలో కొత్త చెట్ల నాటకానికి ప్రోత్సాహకాలు అందిస్తామని స్పష్టం చేశారు. జీడిపప్పు, కోకో ఉత్పత్తి కోసం ప్రత్యేక చర్యలు, గంధం చెట్ల వనాలు, బాదం, పైన్‌నట్స్ కోసం ప్రత్యేక పథకం తీసుకొస్తామని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న 500 రిజర్వాయర్లలో చేపల పెంపకానికి తోడ్పాటు అందిస్తామన్నారు. పశు సంవర్ధక శాఖలో భారీ ప్రోత్సాహకాలు, అధిక విలువ పంటలకు ప్రోత్సాహం, తీర ప్రాంతాల్లో కొబ్బరి, గంధం చెట్ల నాటకానికి ప్రోత్సాహం ఇస్తామని కేంద్ర మంత్రి ప్రకటించారు. నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్, వ్యవసాయ రంగ వృద్ధికి కొత్త దిశానిర్దేశం చేసింది. పంటలపైనే కాకుండా, వ్యవసాయ అనుబంధ రంగాలైన మత్స్య, పశుపోషణ ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ బడ్జెట్‌లో కీలక ప్రతిపాదనలు చేశారు. 'వికసిత భారత్ 2047' లక్ష్య సాధనలో భాగంగా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఈ రెండు రంగాలకు పెద్దపీట వేస్తున్నట్లు బడ్జెట్ ప్రసంగం స్పష్టం చేసింది. దేశ వ్యవసాయ జీడీపీలో, ఉపాధి కల్పనలో కీలక పాత్ర పోషిస్తున్న మత్స్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. ఇందులో భాగంగా, 500 జలాశయాలు, 'అమృత్ సరోవర్'లను సమీకృతంగా అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు. ఈ జలాశయాలు ఒకవైపు సాగునీటి అవసరాలు తీరుస్తూనే, మరోవైపు చేపల పెంపకానికి అనువుగా మారనున్నాయి. తద్వారా భూమిలేని, సన్నకారు రైతులకు అదనపు ఆదాయ వనరులు లభిస్తాయి. ముఖ్యంగా తీర ప్రాంతాల్లో స్టార్టప్‌లు, మహిళా సంఘాలు, మత్స్యకార రైతు ఉత్పత్తిదారుల సంఘాలను భాగస్వామ్యం చేసి విలువ గొలుసును పటిష్టం చేయనున్నారు. నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు, మారుతున్న వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా ఈ ప్రణాళిక దోహదపడుతుంది. చేపల ల్యాండింగ్ కేంద్రాలు, కోల్డ్ చైన్‌లు, ప్రాసెసింగ్ సౌకర్యాలలో పెట్టుబడులను ప్రోత్సహించడం ద్వారా మత్స్యకారులకు మెరుగైన ధర లభించేలా చర్యలు చేపట్టనున్నారు. సముద్ర వాణిజ్యంలో పోటీతత్వాన్ని పెంచేందుకు, భారత ప్రత్యేక ఆర్థిక మండలి, అంతర్జాతీయ జలాల్లో భారతీయ నౌకలు పట్టుకున్న చేపలను భారత ఓడరేవులకు తీసుకొస్తే సుంకం లేకుండా పరిగణిస్తారు. అదే సమయంలో, వాటిని విదేశీ పోర్టులకు తరలిస్తే ఎగుమతులుగా భావిస్తారు. అలాగే, గత ఆర్థిక సంవత్సరంలో ఎగుమతి చేసిన సముద్ర ఉత్పత్తుల విలువలో సుంకం లేని ముడిసరుకుల దిగుమతి పరిమితిని 1% నుండి 3%కి పెంచారు. రైతుల ఆదాయాన్ని పెంచడంలో పశుపోషణ రంగాన్ని మరో కీలకమైన అస్త్రంగా ప్రభుత్వం గుర్తించింది. గ్రామీణ, పాక్షిక-పట్టణ ప్రాంతాల్లో నాణ్యమైన ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు పలు చర్యలను ప్రకటించారు. పశు పోషణ రంగంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు క్రెడిట్-లింక్డ్ సబ్సిడీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. పాడి, పౌల్ట్రీ, సంబంధిత కార్యకలాపాలలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు సులభంగా ప్రారంభించి, విస్తరించేందుకు ఇది మార్గం సుగమం చేస్తుంది. తద్వారా ప్రైవేట్ పెట్టుబడులు ఆకర్షించవచ్చు. పశు పోషణ మౌలిక సదుపాయాలను ఆధునికీకరించడంపై కూడా బడ్జెట్‌లో దృష్టి సారించారు. మెరుగైన పశు ప్రజనన కేంద్రాలు, మేలైన దాణా వ్యవస్థలు, పశు ఆరోగ్య సేవలు, ఉన్నతమైన కోల్డ్ చైన్ లాజిస్టిక్స్‌ను అభివృద్ధి చేస్తారు. ఈ ఆధునికీకరణతో పశుపోషణను కేవలం జీవనాధారం నుండి వ్యవస్థీకృత, మార్కెట్-ఆధారిత వ్యాపారంగా మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పాడి, పౌల్ట్రీ రంగాలలో సేకరణ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ సౌకర్యాలను పెంచడం ద్వారా సామర్థ్యాన్ని పెంచి, వ్యర్థాలను తగ్గించి, రైతులకు అదనపు విలువలో ఎక్కువ వాటా దక్కేలా చూడనున్నారు.

# ఏప్రిల్ 1 నుంచి కొత్త ఐటీ చట్టం

**నిర్మలా సీతారామన్ ప్రకటన**

న్యూఢిల్లీ: రానున్న ఏప్రిల్ 1వ తేదీ నుంచి నూతన ఆదాయ పన్ను చట్టం అమల్లోకి వస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశ పెట్టిన ఆమె లోక్‌సభలో ప్రసంగిస్తూ, సామాన్యులు కూడా ఫైల్ చేసేలా ఆదాయపు పన్ను చట్టంలో మార్పులు చేసినట్లు చెప్పారు. సరళతరం చేసిన ఫారాలు త్వరలో అందుబాటులోకి వస్తాయని ఆమె తెలిపారు. సవరించిన పన్ను రిటర్నుల దాఖలు గడువును పెంచుతున్నట్లు తెలిపారు. డిసెంబర్ 31తో గడువు ముగిసిందని, దీనిని మార్చి 31 వరకు పొడిగిస్తున్నట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. విదేశీ యాత్రలపై పన్ను తగ్గిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే విదేశీ విద్య, వైద్యంపై టీడీఎస్ 5 శాతం నుంచి 2 శాతానికి తగ్గించనున్నట్లు తెలిపారు. మానవ వనరుల సరఫరా సంస్థలపై కూడా టీడీఎస్ తగ్గించనున్నట్లు తెలిపారు. ఈ ఏజెన్సీలపై 1 లేదా 2 శాతం టీడీఎస్ వర్తిస్తుందని అన్నారు. రహదారి ప్రమాదాల పరిహారం వడ్డీపై పన్నును తొలగిస్తున్నామని అన్నారు. చిన్న మొత్తంలో పన్ను చెల్లింపులు జరిపే వారికి కూడా ప్రత్యేక పథకం తీసుకు వస్తున్నట్లు తెలిపారు. ఇక నుంచి విదేశీ ఆస్తుల వివరాలు వెల్లడించడం తప్పనిసరి అని నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగం సందర్భంగా స్పష్టం చేశారు. అదే సమయంలో కంపెనీల బైబ్యాక్ విధానాలకు కేంద్ర ఆర్థిక మంత్రి షాకిచ్చారు.

# ఎన్నారైలకు స్టాక్ పెట్టుబడికి అనుమతి

విదేశాల్లో నివసిస్తున్న భారతీయులకు (ప్రవాసులు) కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇకపై వారు పోర్ట్‌ఫోలియో ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్ ద్వారా భారత స్టాక్ మార్కెట్లో నేరుగా పెట్టుబడులు పెట్టవచ్చని ఆదివారం ప్రకటించింది. 2026 బడ్జెట్ ప్రసంగంలో భాగంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ కీలక ప్రకటన చేశారు. ఈ కొత్త నిబంధనల ప్రకారం, ఒక కంపెనీలో ప్రవాస భారతీయుల వ్యక్తిగత పెట్టుబడి పరిమితిని 5 శాతం నుంచి 10 శాతానికి పెంచారు. అదేవిధంగా, ఒక కంపెనీలో ప్రవాస భారతీయులందరి మొత్తం పెట్టుబడి పరిమితిని 10 శాతం నుంచి 24 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. పోర్ట్‌ఫోలియో మార్గం ద్వారా భారత ఈక్విటీలలో పెట్టుబడులు పెట్టేందుకు ఈ నిర్ణయం వీలు కల్పిస్తుంది. పోర్ట్‌ఫోలియో ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్ అనేది ఆర్‌బీఐ ఆమోదించిన ప్రత్యేక బ్యాంక్ ఖాతా ద్వారా ప్రవాస భారతీయులు, విదేశీ ఇన్వెస్టర్లు భారత స్టాక్స్‌ను కొనుగోలు చేయడానికి, విక్రయించడానికి అనుమతించే ఒక వ్యవస్థ. ఇది పెట్టుబడి పరిమితులను నిర్దేశిస్తుంది, నిబంధనలకు అనుగుణంగా లావాదేవీలు జరిగేలా చూస్తుంది. అలాగే, పెట్టుబడి పెట్టిన నిధులను తిరిగి తమ దేశానికి పంపించుకోవడానికి కూడా అనుమతిస్తుంది. పెట్టుబడిదారుల సంఖ్యను పెంచి, భారత కంపెనీలలోకి దీర్ఘకాలిక విదేశీ మూలధనాన్ని ఆకర్షించడమే ఈ పరిమితుల పెంపు లక్ష్యమని ప్రభుత్వం పేర్కొంది. ఈ చర్యతో దేశీయ మూలధన మార్కెట్లు మరింత బలోపేతం అవుతాయని అంచనా వేస్తున్నారు. ఇదే సమయంలో, సిటీ ఎకనామిక్ రీజియన్స్ పథకానికి రూ. 5,000 కోట్లు కేటాయిస్తున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. అలాగే, నాన్-డెట్ ఇన్‌స్ట్రుమెంట్స్‌కు సంబంధించిన ఫెమా నిబంధనలను కూడా సమీక్షిస్తామని తెలిపారు.



నిక్కీ తంబోలి

# సీనియర్ నటుడు రఘునాథరెడ్డి కన్నుమూత

తెలుగు సినీ ఇండస్ట్రీలో విషాదం నెలకొంది. 370కి పైగా సినిమాల్లో నటించిన సీనియర్ నటుడు రఘునాథ రెడ్డి శనివారం తుది శ్వాస విడిచారు. రఘునాథ రెడ్డి వయసు 82 ఏళ్లు. కృష్ణాజిల్లాలోని కుండేరులో పుట్టిన రఘునాథ రెడ్డి, తెలుగుతో పాటు తమిళ్, కన్నడ, భోజ్‌పురి భాషల్లో కలిపి 370 సినిమాల్లో నటించారు. సినిమాల్లో అవకాశాలు తగ్గిన తర్వాత సీరియల్స్‌లో కూడా నటించారు. నెల రోజుల క్రితం రఘునాథ రెడ్డి కుమారుడు సుధాకర్ గుండెపోటుతో చనిపోయాడు. ఈ శోకం నుంచి తేరుకోలేకపోయిన రఘునాథ రెడ్డి మానసిక వేదనతో కృంగిపోయారు. శనివారం గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచినట్టుగా కుటుంబ సభ్యులు తెలియచేశారు. లాలాగూడ రైల్వే స్టేషన్‌లో పని చేసిన రఘునాథ రెడ్డి, నటన కోసం ఉద్యోగానికి రాజీనామా ఇచ్చారు. 'ఆకాశ రామన్న' డ్రామా వేసి, అవార్డు గెలిచిన రఘునాథ రెడ్డి, నటుడిగా కెరీర్ మలుచుకున్నారు. శోభన్‌బాబు నటించిన 'సర్పయాగం' మూవీతో సినిమా నటుడిగా మారిన రఘునాథ రెడ్డి, 'మదర్ ఇండియా', 'ఎం ధర్మరాజు ఎంఏ', 'చీమల దండు', 'ఒరేయ్ రిక్షా', 'ఎర్రోడు', 'సూర్య పుత్రులు', 'ప్రేమించుకుందాం రా', 'రౌడీ దర్బార్', 'కలెక్టర్ గారు', 'చూడాలని ఉంది', 'ఆహా', 'భద్ర', 'తమ్ముడు', 'రాజకుమారుడు', 'యమజాతకుడు' ఇలా ఎన్నో సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా చేశారు. విలనిజంతో పాటు ఎమోషనల్ సీన్స్ పండించడంలోనూ సత్తా చాటారు. 2012లో 'వాసవి వైభవం' మూవీలో నటించిన రఘునాథ రెడ్డి, అనారోగ్యంతో సినిమాలు తగ్గించారు. ఆ తర్వాత 2018లో సుమంత్ హీరోగా వచ్చిన 'సుబ్రహ్మణ్యపురం' మూవీలో నటించారు. 370 సినిమాల్లో నటించిన రఘునాథ రెడ్డి మరణంపై టాలీవుడ్ నుంచి ఎవ్వరూ స్పందించకపోవడం బాధకరం.





## 2027 సంక్రాంతికి వెంకీ - బాలయ్య ఫైట్!

2027 సంక్రాంతికి విక్టరీ వెంకటేష్, నందమూరి బాలకృష్ణ మధ్య గట్టి పోటీ ఉండేలా కనిపిస్తోంది. వెంకటేష్ తన సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఒక సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఇది గత ఏడాది రిలీజ్ అయి హిట్ కొట్టిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకు సీక్వెల్ కావచ్చని ఒక టాక్ నడుస్తోంది. అయితే ఇది సీక్వెల్ లా కాకుండా ఒక స్టాండలోన్ సినిమాగా వచ్చే ఛాన్స్ కూడా ఉందట. దీనిపై అఫీషియల్ క్లారిటీ రావాల్సి ఉన్నా, వెంకీ మాత్రం పండగ బరిలో ఉండటం పక్కా అనిపిస్తోంది. మరోవైపు నటసింహం బాలకృష్ణ కూడా తన మాస్ డైరెక్టర్ గోపిచంద్ మలినేనితో కలిసి పండగ రేసులో నిలవబోతున్నారట. గతంలో వీరిద్దరి కాంబోలో వచ్చిన 'వీరసింహారెడ్డి' సంక్రాంతికి వచ్చి ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేసిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు మళ్ళీ అదే మేజిక్ రిపీట్ చేసేందుకు గోపిచంద్ ఒక పవర్ ఫుల్ స్క్రిప్ట్ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ పనులు మొదలవ్వాల్సి ఉంది. బాలయ్య – గోపిచంద్ మలినేని కాంబో అంటేనే మాస్ ప్రేక్షకుల్లో ఉండే హైప్ వేరే రేంజ్ లో ఉంటుంది. వెంకటేష్ సినిమాతో అనిల్ రావిపూడి హ్యాట్రిక్ కొట్టాలని చూస్తుంటే, బాలయ్య సినిమాతో గోపిచంద్ మరో మాస్ బ్లాక్ బస్టర్ పై కన్నేశారు. ఒక పక్క ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్, మరో పక్క ఊరమాస్ యాక్షన్.. ఇలా రెండు భిన్నమైన జోనర్లు ఒకేసారి తలపడితే బాక్సాఫీస్ దగ్గర సంబరాలు అంబరాన్ని తాకడం ఖాయం.



## సుకుమార్‌తో చరణ్ మాస్ ఫిల్మ్!

పెద్ది సినిమా షూటింగులో బిజీగా ఉంటూనే చరణ్ మరోవైపు తన తర్వాతి సినిమాపై ఫోకస్ చేశారు. పెద్ది తర్వాత చరణ్, సుకుమార్ దర్శకత్వంలో సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. చరణ్ కెరీర్లో 17వ సినిమాగా రంగస్థలం తర్వాత వీరిద్దరి కాంబినేషన్ లో రాబోతున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్టుపై మంచి బజ్ ఉంది. ఇదిలా ఉంటే పుష్ప2 తర్వాత నుంచి చరణ్ సినిమాపైనే కసరత్తులు చేస్తున్న సుకుమార్ మెగా పవర్ స్టార్ కోసం రెండు కథల్ని రెడీ చేశారని తెలుస్తోంది. తన రెగ్యులర్ స్టైల్ కు తగ్గట్టు ఓ క్లాస్ కథతో పాటూ, రంగస్థలం లాంటి ఓ మాస్ కథను కూడా రెడీ చేశారని టాక్ వినిపిస్తోంది. ఈ రెండింటిలో రామ్ చరణ్ మాస్ సినిమాకు ఓటు వేశాడని అంటున్నారు. అదే నిజమైతే రామ్ చరణ్ నుంచి మరో మాస్ ట్రీట్ రావడం ఖాయం. పుష్ప2 తర్వాత సుకుమార్ నుంచి వస్తున్న సినిమా కావడంతో ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉంటాయి. కాబట్టి ఈ విషయాన్ని అతను దృష్టిలో పెట్టుకుని జాగ్రత్త పడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే సుకుమార్ కథతో పాటూ చరణ్ లుక్ విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకుంటున్నారని, ఈ ఇయర్ సమ్మర్ నుంచి సినిమాను మొదలుపెట్టి, వచ్చే ఏడాది రిలీజ్ చేసేలా మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని తెలుస్తోంది.



## బోల్డ్ పాత్రలు ఎంజాయ్ చేస్తా

కమల్ హాసన్ కుమార్తెగా సినీ లోకానికి పరిచయమైన శ్రుతి హాసన్ మొదటి నుంచి గాయనిగా, సంగీత దర్శకురాలిగా, నటిగా ఇలా తనలోని మల్టీ టాలెంటెడ్ పర్సన్ ని అప్పుడప్పుడు ప్రేక్షకులకు పరిచయం చేస్తూనే వచ్చారు. ఐతే, తాజాగా శ్రుతి హాసన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "నాకు విభిన్న మార్గాల్లో నడవడం ఇష్టం. ఒకే గుర్తింపులో నన్ను నేను బంధించాలనుకోవట్లేదు. నాకు సంగీతం, నటన, రచన అంటే చాలా ఇష్టం. అయినప్పటికీ అన్నింటి కన్నా ముందు నటిగా ఉండటానికే ఇష్టపడతాను. నాకు అదే ఆనందాన్నిస్తుంది' అని శ్రుతి తెలిపింది. శ్రుతి హాసన్ ఇంకా మాట్లాడుతూ.. 'నాకు నచ్చే పాత్రల విషయానికి వస్తే.. నేను శారీరక శ్రమతో కూడిన పాత్రలు చేయాలనే కోరిక నాకు ఉంది. అలాగే, బోల్డ్ పాత్రలను చేసేటప్పుడు కూడా నేను బాగా ఎంజాయ్ చేస్తాను. సినిమా నా వృత్తి జీవితంలో ఒక భాగం. కానీ సంగీతం నా వ్య క్తిగత విషయం. సినిమా నాకు ప్రజలతో ఎలా ఉండాలో నేర్పించింది. ఆ పాఠాలే ఒక సంగీతకారిణిగా, మనిషిగా నన్ను ముందుకు నడిపిస్తున్నాయి' అని శ్రుతి హాసన్ పేర్కొంది.

## అల్లు వారి బ్యాచిలర్ పార్టీ

అల్లు వారి పెళ్లి సందడి ఇప్పుడు పీక్స్‌కి చేరుకుంది! అల్లు శిరీష్– నైనిక జంట పెళ్లికి మార్చి 6న ముహూర్తం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే నెలరోజుల ముందే ప్రీవెడ్డింగ్ సెలబ్రేషన్స్ మొదలైపోయాయి. ముఖ్యంగా శిరీష్ – నైనిక జంట తమ స్నేహితుల కోసం దుబాయ్ లో గ్రాండ్ గా బ్యాచిలర్ పార్టీని ఏర్పాటు చేసారు. ఈ పార్టీకి అల్లు అర్జున్ – స్నేహారెడ్డి జంట కూడా అటెండయిన ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్ లో వైరల్‌గా మారుతున్నాయి. అయితే పెళ్లికి వెన్యూ ఎక్కడ? అన్నదానిపై ఇంకా అధికారికంగా ఎలాంటి వివరాలు వెల్లడి కాలేదు. ప్రస్తుతానికి సోషల్ మీడియాల్లో దుబాయ్ బ్యాచిలర్ పార్టీ నుంచి కొన్ని ఫోటోలు మాత్రం లీకయ్యాయి. ఈ వేడుకల్లో భాగంగా దుబాయ్‌లోని ఒక లగ్జరీ యాచ్‌పై శిరీష్ షాంపేన్ బాటిల్ తో ఛీరప్ చేసిన వీడియోలు నెట్టింట హల్చల్ చేస్తున్నాయి. ఇక బన్ని – స్నేహ జంట ఈ పార్టీకి ప్రత్యేక ఆకర్షణగా మారారు. బ్రదర్స్ ఇద్దరూ పార్టీలో తలమునకలయ్యారు.







## పూజా హెగ్డే ఫాంలోకి వస్తుందా?

వచ్చే ఏడాది సంక్రాంతి పండుగను కూడా తన కామెడీ మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కొల్లగొట్టాలని అనిల్ రావిపూడి గట్టి ప్లాన్ వేశారు. ఈ క్రేజీ ప్రాజెక్టులో గ్లామర్ అండ్ పర్ఫార్మెన్స్ యాడ్ చేయడానికి పూజా హెగ్డేను హీరోయిన్‌గా పరిశీలిస్తుండటం అంచనాలను మరింత పెంచేస్తోంది. ఒకప్పుడు టాలీవుడ్ గోల్డెన్ లెగ్‌గా పేరు తెచ్చుకున్న పూజా హెగ్డేకు 2025 సంవత్సరం అంతగా కలిసి రాలేదు. సూర్యతో కలిసి చేసిన 'రెట్రో' ఆశించిన విజయాన్ని అందించకపోగా, రజనీకాంత్ 'కూలీ' చిత్రంలో కేవలం ఒక సాంగ్ కే పరిమితమైంది. ఇప్పుడు ఆమెకు ఒక సాలిడ్ హిట్ చాలా అవసరం. అనిల్ రావిపూడి సినిమాల్లో హీరోయిన్ల పాత్రలు చాలా ఎనర్జిటిక్ గా, కామెడీ టైమింగ్‌తో ఉంటాయి.

## రౌడీ జనార్ధనలో శోభన!?

టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ ప్రస్తుతం దర్శకుడు రవి కిరణ్ కోలా దర్శకత్వంలో రౌడీ జనార్దన సినిమా చేస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఆ మాస్ ఎంటర్టైనర్ పై ఇప్పటికే ఆడియన్స్, అభిమానుల్లో మంచి ఆసక్తి నెలకొంది. తాజాగా ఆ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికర అప్డేట్ ఫిల్మ్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. చిత్రంలో సీనియర్ హీరోయిన్ శోభన కీలక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఫ్లాష్ బ్యాక్ సన్నివేశాల్లో విజయ్ దేవరకొండకు తల్లి పాత్రలో ఆమె నటించబోతున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఒకప్పుడు తన అందం, అభినయంతో తెలుగు ప్రేక్షకులను అలరించిన శోభన మళ్లీ సిల్వర్ స్క్రీన్ పై కనిపించబోతున్నారన్న వార్త అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. దాదాపు 18 ఏళ్ల తర్వాత శోభన కల్కి 2898 ఏడీ సినిమాతో తెలుగులో రీఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ సినిమా తర్వాత మరోసారి రౌడీ జనార్ధనలో ముఖ్యమైన పాత్రలో నటించే అవకాశం ఉంది.




# పాక్ బుడ్డోళ్లు ఇంటిదారి

**అండర్ 19లో భారత్ ఘన విజయం**

**భారత కుర్రాళ్ల అద్భుత పోరాటం**

**ఆఫ్ఘనిస్థాన్‌తో సెమీస్ పోరు**

అండర్ 19 వరల్డ్ కప్ 2026 టోర్నీలో భారత జట్టు జైత్ర యాత్ర కొనసాగుతోంది. తాజాగా దాయాది పాకిస్తాన్‌తో మ్యాచ్‌లో 58 పరుగుల తేడాతో ఘన విజయం అందుకుంది భారత జట్టు. ఒకానొక దశలో టీమిండియా, పాక్ చేతుల్లో ఓటమి తప్పదేమో అనుకున్నారంతా. అయితే భారత బౌలర్ల మాస్ కమ్‌బ్యాక్‌తో మ్యాచ్‌ని కైవసం చేసుకుంది భారత జట్టు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత అండర్19 టీమ్, 49.5 ఓవర్లలో 252 పరుగులకి ఆలౌట్ అయ్యింది. ఆరోన్ జార్జ్ 16 పరుగులు చేయగా కెప్టెన్ ఆయుష్ మాత్రే డకౌట్ అయ్యాడు. యంగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ 22 బంతుల్లో 5 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 30 పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. వేదాంత్ త్రివేది 98 బంతుల్లో 2 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 68 పరుగులు చేసి భారత జట్టుని ఆదుకున్నాడు. విహాన్ మల్హోత్రా 21 పరుగులు, అభిజ్ఞాన్ కుందు 16, ఆర్ఎస్ అంబ్రీష్ 20, కనిష్క్ చౌహాన్ 29 బంతుల్లో 4 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 35 పరుగులు, ఖిలాన్ పటేల్ 15 బంతుల్లో 2 ఫోర్లు, ఓ సిక్సర్‌త 21 పరుగులు చేసి రాణించారు. ఓపెనర్లతో పాటు టాపార్డర్ బ్యాటర్లు రాణించడంతో 253 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన పాకిస్తాన్ జట్టు, ఒకానొక దశలో 29 ఓవర్లలో 151/2 స్కోరు చేసి ఈజీగా గెలిచేలా కనిపించింది. అయితే భారత బౌలర్లు కమ్‌బ్యాక్ ఇవ్వడంతో వరుస వికెట్లు కోల్పోయింది. సమీర్ మిన్హాస్ 9 పరుగులు చేయగా హమ్జా జరూర్ 49 బంతుల్లో 8 ఫోర్లతో 42 పరుగులు చేశాడు. ఉస్మాన్ ఖాన్ 92 బంతుల్లో 7 ఫోర్లతో 66 పరుగులు చేశాడు. కెప్టెన్ ఫర్హాన్ హుస్సేన్ 39 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 38 పరుగులు చేశాడు. అయితే ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు అందరూ వరుసగా పెవిలయన్‌కి క్యూ కట్టారు. అహ్మద్ హుస్సేన్ 2, ఆలీ హసన్ బలోచ్ 3, అబ్దుల్ శుభన్ 7, హుజైఫా అహ్సాన్ 14, మహ్మద్ సయ్యమ్ 3 పరుగులు చేశారు. భారత బౌలర్లలో కెప్టెన్ ఆయుష్ మాత్రమే 8 ఓవర్లలో 21 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీశాడు. ఖిలాన్ పటేల్ 3 వికెట్లు తీయగా అంబ్రీష్, హెనిల్ పటేల్, కనిష్క్ చౌహాన్, విహాన్ మల్హోత్రా తలా ఓ వికెట్ తీశారు. టోర్నీలో వరుసగా నాలుగో అందుకున్న భారత జట్టు, సెమీ ఫైనల్‌కి దూసుకెళ్లింది. ఫిబ్రవరి 4న ఆఫ్ఘనిస్తాన్ అండర్ 19తో సెమీ ఫైనల్ మ్యాచ్ ఆడుతుంది భారత అండర్ 19 జట్టు. ఫిబ్రవరి 3న జరిగే మరో సెమీ ఫైనల్‌లో ఆస్ట్రేలియా అండర్ 19 జట్టు, ఇంగ్లాండ్ అండర్ 19 జట్టుతో తలబడుతోంది. టీమిండియాతో మ్యాచ్‌లో ఓటమితో పాకిస్తాన్, సూపర్ సిక్స్ రౌండ్ నుంచే ఇంటిదారి పట్టింది.




# పాక్ బాయ్‌కాట్

**భారత్‌తో మ్యాచ్‌లు ఆడబోం**

**మిగతా టీ20 వరల్డ్ కప్ మ్యాచ్‌లకు ఓకే**

**పాక్ సర్కారు సంచలన ప్రకటన**

శ్రీలంక, భారత్ సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న టీ20 ప్రపంచకప్ 2026కు సంబంధించి పాకిస్థాన్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు తమ క్రికెట్ జట్టుకు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది. అయితే, ఫిబ్రవరి 15న కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియంలో భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌లో తమ జట్టు పాల్గొనబోదని అధికారికంగా ప్రకటించి క్రీడా ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. ఈ అనూహ్య నిర్ణయం టోర్నమెంట్ భవితవ్యంతో పాటు ఆర్థిక సమీకరణాలను కూడా ప్రశ్నార్థకం చేసింది. “ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026లో పాల్గొనేందుకు పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు మా ప్రభుత్వం ఆమోదం తెలుపుతోంది. కానీ, ఫిబ్రవరి 15న భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌లో పాకిస్థాన్ జట్టు బరిలోకి దిగదు” అని పాకిస్థాన్ ప్రభుత్వ అధికారిక ‘ఎక్స్’ ఖాతాలో ఒక ప్రకటనను విడుదల చేశారు. ఈ నిర్ణయం వెనుక కచ్చితమైన కారణాన్ని వెల్లడించనప్పటికీ, బంగ్లాదేశ్‌కు మద్దతుగా పాక్ ఈ బహిష్కరణకు దిగినట్టు తెలుస్తోంది. భద్రతా కారణాల దృష్ట్యా తమ మ్యాచ్‌లను భారత్ నుంచి తరలించాలని బంగ్లాదేశ్ చేసిన విజ్ఞప్తిని ఐసీసీ తిరస్కరించింది. అనంతరం బంగ్లాదేశ్‌ను టోర్నీ నుంచి తప్పించి, వారి స్థానంలో స్కాట్లాండ్‌ను చేర్చింది. ఈ చర్యకు నిరసనగానే పాకిస్థాన్ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు అంతర్జాతీయ క్రీడా వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇటీవల పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఛైర్మన్ మోహ్సిన్ నఖ్వీ, ప్రధాని షహబాజ్ షరీఫ్‌తో సమావేశమై టోర్నీలో పాల్గొనడంపై చర్చించారు. దీనిపై తుది నిర్ణయాన్ని జనవరి 30 లేదా ఫిబ్రవరి 2న ప్రకటిస్తామని అప్పుడు వెల్లడించారు. అయితే, ఒకరోజు ముందుగానే ఈ కీలక ప్రకటన వెలువడటం గమనార్హం. ఈ నిర్ణయం వెలువడుతుందని ముందే ఊహించిన పీసీబీ, ప్రపంచకప్ కోసం తమ జట్టు జెర్సీ ఆవిష్కరణ కార్యక్రమాన్ని కూడా వాయిదా వేసుకుంది. ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూసే మ్యాచ్‌లలో భారత్-పాకిస్థాన్ పోరుకు ఉండే క్రేజే వేరు. ఈ ఒక్క మ్యాచ్ ద్వారానే టోర్నమెంట్‌కు ప్రసార హక్కులు, స్పాన్సర్‌షిప్‌ల రూపంలో భారీ ఆదాయం సమకూరుతుంది. ఇప్పుడు ఈ హై-వోల్టేజ్ మ్యాచ్ రద్దు కావడంతో ఐసీసీకి, ప్రసార హక్కుదారులకు ఇది కొత్త తలనొప్పిగా మారింది. కాగా, సల్మాన్ అలీ అగా నేతృత్వంలోని పాకిస్థాన్ జట్టు ఈ టోర్నీలో గ్రూప్ ‘ఏ’లో ఉంది. ఈ గ్రూప్‌లో భారత్, నమీబియా, నెదర్లాండ్స్, యూఎస్ఏ జట్లు కూడా ఉన్నాయి. పాకిస్థాన్ తన తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 7న కొలంబోలో నెదర్లాండ్స్‌తో ఆడనుంది.

# కుల్దీప్, వరుణ్ కీలకం: రోహిత్ శర్మ

టీ20 వరల్డ్ కప్ 2026 టోర్నీలో హాట్ ఫేవరెట్‌గా బరిలో దిగుతోంది భారత జట్టు. డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో 2026 టీ20 వరల్డ్ కప్ ఆడుతున్న భారత జట్టుకి సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. గత టీ20 వరల్డ్ కప్ ఆడిన టీమ్‌లో సభ్యులుగా ఉన్న విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, రవీంద్ర జడేజా.. ఈసారి ప్రపంచ కప్ ఆడడం లేదు. టీ20 వరల్డ్ కప్ విన్నింగ్ కెప్టెన్ రోహిత్ శర్మ, భారత జట్టుకి కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చాడు. ‘నా ఉద్దేశంలో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌లకు ఇదో పెద్ద ఛాలెంజ్. ముఖ్యంగా కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి ఇద్దరినీ ఎలా ఆడించాలో కనిపెట్టడం పెద్ద తలనొప్పి. ఈ ఇద్దరు స్పిన్నర్లను తుది జట్టులోకి తీసుకురావాలంటే ఇద్దరు ఫాస్ట్ బౌలర్లను మాత్రమే ఆడించే అవకాశం ఉంటుంది. అది చాలా పెద్ద ఛాలెంజ్. న్యూజిలాండ్‌తో సిరీస్‌లో చూస్తూనే ఉన్నాం, తేమ చాలా ఎక్కువగా ఉంటోంది. ఎంత లక్ష్యాన్నైనా ఈజీగా ఛేజ్ చేసేస్తున్నారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఈ తేమ చాలా ఎక్కువగా ఉంటుంది. చలికాలం అయిపోయి, ఎండలు మొదలవుతాయి. ముంబైలో కూడా ఉష్ణోగ్రత పెరుగుతుంది. సెకండ్ ఇన్నింగ్స్‌లో తేమ చాలా కీలక పాత్ర పోషిస్తుంది. ఇండియాలో 90-95 శాతం గ్రౌండ్స్‌లో తేమ ఎక్కువగా ఉంటుంది. ఇది అన్ని టీమ్స్‌కి సవాల్ లాంటిదే! కెప్టెన్, కోచ్ ఏం ఆలోచిస్తున్నారో తెలీదు. ముగ్గురు స్పిన్నర్లను ఆడిస్తారా? అలా అయితే ఓ పేసర్‌ని జట్టు నుంచి తప్పించాల్సి ఉంటుంది. అది మంచిది కాదు. మరి ఏం చేస్తారు? ఎలా మ్యానేజ్ చేస్తారు? ఇప్పుడు ఇవన్నీ టీమ్ లీడర్‌షిప్‌కి పరీక్షే..’ అంటూ చెప్పుకొచ్చాడు. కాగా, ఐసీసీ పురుషుల టీ20 వరల్డ్ కప్ 2026 టోర్నీలో భాగంగా ఫిబ్రవరి 7న యూఎస్ఏతో భారత జట్టు తొలి మ్యాచ్ ఆడనుంది.





# ఆటలకు ఫుల్లు పైసల్

**క్రీడారంగానికి బడ్జెట్‌లో భారీ ప్రోత్సాహం**

**ఒలింపిక్స్ లక్ష్యంగా కీలక నిర్ణయాలు**

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం నాడు ఢిల్లీలో ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్‌లో క్రీడారంగానికి పెద్దపీట వేశారు. క్రీడా బడ్జెట్ కేటాయింపులను పెంచడం, దేశీయంగా క్రీడా పరికరాల తయారీని ప్రోత్సహించడం, ఖేలో ఇండియా మిషన్‌ను మరో పదేళ్లపాటు పొడిగించడం వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 2030 కామన్వెల్త్ గేమ్స్, 2036 ఒలింపిక్స్ నిర్వహణకు భారత్ బిడ్ దాఖలు చేసిన నేపథ్యంలో ఈ నిర్ణయాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, “నాణ్యమైన, తక్కువ ధరకే క్రీడా పరికరాలను అందించే గ్లోబల్ హబ్‌గా ఎదిగే సత్తా భారత్‌కు ఉంది” అని అన్నారు. క్రీడా పరికరాల తయారీ, పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రతిపాదించారు. మీరట్, జలంధర్ వంటి క్రీడా పరికరాల తయారీ కేంద్రాలకు ఇది మరింత ఊతమిస్తుందని భావిస్తున్నారు. భవిష్యత్ ఛాంపియన్లను తయారు చేసేందుకు రూ. 10,000 కోట్లతో ప్రత్యేకంగా ఒక ఛాలెంజ్ గ్రోత్ ఫండ్‌ను కూడా మంత్రి ప్రతిపాదించారు. ఖేలో ఇండియా కార్యక్రమం ద్వారా క్రీడా ప్రతిభను ప్రోత్సహించడంలో మంచి ఫలితాలు వస్తున్నాయని, ఈ స్ఫూర్తిని కొనసాగిస్తూ రాబోయే దశాబ్ద కాలానికి “ఖేలో ఇండియా మిషన్”ను ప్రారంభిస్తున్నట్లు ఆమె ప్రకటించారు.

# చాంపియన్ అల్కరాజ్!

**విశ్వవిజేతగా పదోసారి.. జకోవిచ్‌ను మళ్లీ నిరాశే**

ఆస్ట్రేలియా ఓపెన్ 2026 పురుషుల సింగిల్స్ టైటిల్‌ను స్పెయిన్ సెన్సేషన్ కార్లోస్ అల్కరాజ్ గెలుచుకున్నాడు. ఆదివారం ఉత్కంఠగా సాగిన ఫైనల్లో టాప్ సీడ్ అల్కరాజ్ 2-6, 6-2, 6-3, 7-5 తేడాతో 10 సార్లు ఛాంపియన్, ఆరో సీడ్ అయిన నోవాక్ జకోవిచ్‌ను ఓడించాడు. ఈ గెలుపుతో కెరీర్‌లో తొలి ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్‌ను అందుకున్నాడు. తద్వారా నాలుగు గ్రాండ్ స్లామ్ టైటిళ్లను (ఆస్ట్రేలియా ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్, యుఎస్ ఓపెన్) గెలుచుకున్న అతి పిన్న వయస్కుడిగా అల్కరాజ్ చరిత్రకెక్కాడు. 22 ఏళ్ల వయసులోనే ఈ ఫీట్ సాధించి రాఫెల్ నాదల్ పేరిట ఉన్న రికార్డును అధిగమించాడు. నాదల్ 24 ఏళ్ల వయసులో ఈ ఘనతను అందుకున్నాడు. సుమారు 3 గంటల పాటు సాగిన ఫైనల్లో జకోవిచ్, అల్కరాజ్ హోరాహోరీగా తలపడ్డారు. తొలి సెట్‌లో జకోవిచ్ తన అనుభవంతో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. అల్కరాజ్‌కు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా 6-2తో తొలి సెట్‌ను గెలుచుకున్నాడు. తొలి సెట్ కోల్పోయినా ఏ మాత్రం నిరాశకు గురికాని అల్కరాజ్.. రెండో సెట్‌లో దూకుడుగా ఆడాడు. జకోవిచ్ సర్వీసులను బ్రేక్ చేసి 6-2తో రెండో సెట్‌ను కైవసం చేసుకుని మ్యాచ్‌ను సమం చేశాడు. మూడో సెట్‌లోనూ అదే జోరును కొనసాగించిన స్పెయిన్ స్టార్, వరుస విన్నర్లతో జకోవిచ్‌ను ఒత్తిడిలోకి నెట్టి 6-3తో సెట్‌ను సొంతం చేసుకున్నాడు. ఆఖరి సెట్ మరింత ఉత్కంఠగా సాగగా.. స్కోరు 5-5 వద్ద ఉన్నప్పుడు అల్కరాజ్ అద్భుతమైన ఆటతీరుతో జకోవిచ్ సర్వీస్‌ను బ్రేక్ చేసి, ఆ తర్వాత తన సర్వీస్‌ను నిలబెట్టుకుని 7-5తో సెట్‌తో పాటు టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ విజయంతో అల్కరాజ్ సుమారు రూ. 26.5 కోట్ల ప్రైజ్ మనీని గెలుచుకున్నాడు. ఈ చారిత్రాత్మక విజయం తర్వాత అల్కరాజ్ భావోద్వేగానికి గురయ్యాడు.‘కెరీర్ గ్రాండ్ స్లామ్ పూర్తి చేయడం ఒక కలలా ఉంది. అది కూడా జకోవిచ్‌ను ఓడించి ఈ కలను సాకారం చేసుకోవడం మరింత ప్రత్యేకం’అని తెలిపాడు. ‘ఈ మ్యాచ్‌లో గెలిచి ఉంటే, మార్గరెట్ కోర్ట్ (24 టైటిళ్లు) రికార్డును అధిగమించి, టెన్నిస్ చరిత్రలో అత్యధిక గ్రాండ్ స్లామ్ టైటిళ్లు గెలిచిన ఏకైక క్రీడాకారుడిగా జకోవిచ్ నిలిచేవాడు. ఆస్ట్రేలియా ఓపెన్ ఫైనల్లో జకోవిచ్‌కు ఇదే తొలి ఓటమి.





# రంజీ క్వార్టర్స్‌లో ఆంధ్ర

**డిఫెండింగ్ ఛాంపియన్ విదర్భ ఔట్**

**క్వార్టర్స్‌లో బెంగాల్‌తో ఆంధ్ర ఢీ**

ప్రతిష్ఠాత్మక దేశవాళీ టోర్నీ రంజీ ట్రోఫీలో ఆంధ్ర క్రికెట్ జట్టు నాకౌట్ దశకు దూసుకెళ్లింది. ఉత్కంఠభరితంగా సాగిన ఏడో రౌండ్ లీగ్ మ్యాచ్‌ల చివరి రోజున అనుకూల ఫలితంతో క్వార్టర్ ఫైనల్స్‌లో తమ స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. క్వార్టర్స్‌లో ఆంధ్ర జట్టు బెంగాల్‌తో తలపడనుంది. గ్రూప్-ఏలో ఝార్ఖండ్, ఆంధ్ర, డిఫెండింగ్ ఛాంపియన్ విదర్భ 31 పాయింట్లతో సమంగా నిలిచాయి. అయితే, ఎక్కువ బోనస్ పాయింట్ల విజయాలు సాధించిన జట్లను పరిగణనలోకి తీసుకోవడంతో ఝార్ఖండ్ (3), ఆంధ్ర (2) క్వార్టర్స్‌కు అర్హత సాధించాయి. కేవలం ఒకే బోనస్ పాయింట్ విజయం సాధించిన విదర్భ అనూహ్యంగా టోర్నీ నుంచి నిష్క్రమించింది. లీగ్ దశలో ఆంధ్ర చేతిలో ఎదురైన ఓటమే విదర్భ కొంపముంచింది. దీంతో ఈ సీజన్‌లో కొత్త రంజీ ఛాంపియన్ రావడం ఖాయమైంది. మరోవైపు, గ్రూప్-బి నుంచి కర్ణాటక అద్భుత ప్రదర్శనతో క్వార్టర్స్‌లో అడుగుపెట్టింది. పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో కెప్టెన్ దేవదత్ పడిక్కల్ కేవలం 85 బంతుల్లో 120 పరుగులు చేసి అజేయంగా నిలిచి, జట్టుకు సంచలన విజయాన్ని అందించాడు. ఈ విజయంతో సౌరాష్ట్ర నాకౌట్ ఆశలు గల్లంతయ్యాయి. ఆంధ్ర, కర్ణాటకతో పాటు ఝార్ఖండ్, ఉత్తరాఖండ్, జమ్మూ కశ్మీర్ కూడా క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి.

# కుంభీపాకం.. క్రిమిభోజనం



యముడి మహిషపు లోహ ఘంటలు ఖణేల్ మంటున్నాయి యమలోకపు ద్వారాలు తెరుచుకుంటున్నాయి నరకలోకపు జాగిలాలు సంకెళ్లు తెంచుకుని ఉరికిపడుతున్నాయి. పాపుల చిట్టా పుటలు చిరుగుతున్నాయి రక్తమాంసాల కాసారం వైతరిణి మరిగిపోతోంది కుంభీపాకం.. క్రిమిభోజనం వంటి నరక శిక్షలు నరుడి కోసం సిద్ధంగా ఉన్నాయి.

"మీరు పుణ్యం చేశారా? అయితే ఇబ్బంది లేదు లెండి.. మీకోసం స్వర్గంలో బోర్డింగ్ రిజర్వ్ అయ్యే ఉంటుంది. పాపం చేశారా? ఇంకేం నరకానికి వెళ్లేందుకు రెడీ కండి.. నరక బాధలు అనుభవించేందుకు సిద్ధం కండి.. పదుల కొద్దీ శిక్షలు దారుణంగా అమలు చేసేందుకు యమభటులు కాచుక్కూచున్నారు. రక్తమాంసాల చెరువు వైతరిణి, పాపులను ముంచెత్తేందుకు సిద్ధంగా ఉంది. స్వర్గం లేదు.. నరకం లేదు.. అని తేలిగ్గా కొట్టిపారేయొద్దు. గరుడ పురాణంలో చెప్పిందేదీ కట్టుకథ కాదు.. నరకం ఉంది.. అసలు నరకం మాటెలా ఉన్నా భూమిపైనే ఆరు చోట్ల నరకాలు ఉన్నాయి.

అపరిచితుడు సినిమా గుర్తుంది కదా... పాపం చేసిన వాళ్లకు, తప్పులు చేసిన వాళ్లకు నరక శిక్షలు ఎలా ఉంటాయో రుచి చూపించిన సినిమా... అంధకూపం.. కుంభీపాకం, క్రిమిభోజనం వంటి పదాలు ఇప్పటికీ మార్మోగుతూనే ఉంటాయి. సినిమాలో అయితే ఏదైనా ఓకే.. కానీ, నిజంగా నరకం వుంటే.. అందులో ఈ శిక్షలు అమలవుతూ ఉంటే.. అనుభవించాల్సిందేనా? యస్.. చనిపోయిన తరువాత ప్రతి ఒక్కరూ వెళ్లే నరకం నిజంగా ఎలా ఉంటుందో.. గుండెను దిటవు చేసుకుని చదవండి. ఒకే ఒక్కక్షణం.. శరీరం నుంచి ప్రాణం వెళ్లిపోతోంది... వందల కొద్దీ తేళ్లు ఒక్కసారిగా కుట్టిన బాధ, ఏమీ చేయలేని అసమర్థత... ఒక్కసారిగా నిశ్శబ్దం... మనిషి చనిపోయాడు.. ఆ తరువాత...ఏం జరుగుతుంది? పొడవాటి జుట్టు... వికృతమైన ఆకారాలు.. పాశం పట్టుకుని యమదూతలు జీవుడిని తీసుకువెళ్లేందుకు సిద్ధంగా ఉంటారు.. క్షణాల్లో యమలోకానికి ఆ జీవుడు ప్రయాణమైపోతాడు.. కటిక చీకటి.. ఎండ.. కార్చిచ్చు.. చెట్టుకు వేలాడ దీసి ముళ్ల గదతో కొట్టడం.. తాళ్లతో కట్టి చర్మం ఒలిచేయటం.. సలసల కాగే నూనెలో వేయించటం.. క్రిమికీటకాలతో భోజనం.. రక్తంతోనే స్నానం.. అన్నీ బాధలే..



కోవెల సంతోష్ కుమార్
రచయిత, 91 90521 16463

భరించలేని బాధలు.. సహించలేని యాతన. మనిషి చనిపోయాక అతను చేసే బాధలను అనుసరించి శిక్షలు అనుభవిస్తారు.. ఒక్కో నరకంలో ఒక్కో శిక్ష.. ఒక్కో శిక్షకు ఒక్కో ప్రత్యేకత.. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 84 లక్షల నరకాలు.. నరక బాధలు.. మనిషి కోసం.. మన కోసం.. పాపం చేసిన వారి కోసం కాచుక్కూచున్నాయి. గరుడ పురాణంలో నరకం గురించి చాలా విషయాలే చెప్పారు.. యమపురి.. యమధర్మరాజు నివాసం.. పాపులకు శిక్షలు విధించే సుప్రీం కోర్టు ఎక్కడుంది? భూమికి 86 వేల యోజనాలు.. అంటే సుమారు మనకు కోటీ 11లక్షల 80వేల కిలోమీటర్ల దూరంలో నరకం.. నరకానికి దారిలో 16 చిన్న యమ నగరాలు ఉన్నాయి. మనిషి చనిపోయిన తరువాత జీవుడు ఈ నగరాల మీదుగానే వెళ్తాడట. రోజుకు పగలూ రాత్రి కలిసి 247 యోజనాలు అంటే సుమారు 3211 కిలోమీటర్లు ప్రయాణం చేస్తాడట. చనిపోయిన తరువాత 13 రోజుల పాటు కర్మకాండ జరిగినంత సేపు అతను అంటే జీవుడు భూమిపైనే ఉంటాడు. కర్మ భాగాన్ని స్వీకరించిన తరువాత యమపురికి బయలుదేరుతాడు. 348రోజులు పూర్తయిన తరువాత అంటే సరిగ్గా చనిపోయిన ఒక ఏడాదికి మూడు రోజుల ముందు తన గమ్యానికి చేరుతాడన్నమాట. అప్పుడు మూడు రోజుల పాటు భూమిపై సంవత్సరీకం జరుగుతుంది. అప్పుడు వైతరిణి నదికి చేరుకుం టుంది. నరకానికి దక్షిణం వైపున వైతరిణి నది ఉంటుంది.. ఇది రక్తమాంసాలతో అతి భయంకరంగా ఉంటుంది. పాపాలు చేసిన వాళ్లు ఈ నదిని దాటి నరకంలోకి ప్రవేశించాల్సి ఉంటుంది. పాపికి తొలి హర్డిల్ ఇదే. ఇది వంద యోజనాల పొడవుంటుంది. అంటే 1300 కిలోమీటర్లన్న మాట.

గరుడ పురాణంలోనే కాదు.. ఇస్లాం, క్రిస్టియానిటీలోనూ నరకం గురించి, గేట్స్ ఆఫ్ హెల్ గురించి సవివరంగా ఉంది.. నరకం ద్వారాలు ఎక్కడెక్కడ ఉన్నాయి, ఎంత దూరంలో ఉన్నాయి అన్న విషయాలు ఈ గ్రంథాల్లో స్పష్టంగానే వివరణలు కనిపిస్తాయి. వీటిని ఆధారం చేసుకుని నిర్వహించిన పరిశోధనలు చాలానే జరిగాయి. ఇస్లాం కూడా నరకానికి ఏడు ద్వారాలుంటాయని చెప్పింది. జహన్నామ్, లజా, అలాహుతామా, సాఇర్, సఖర్, అల్ జహీమ్, హానియా అంటూ ఇస్లాం చెప్పిన నరకాల్లోనూ పాపికి తాగటానికి చీమూ నెత్తురూ ఇస్తారని, భయంకరమైన శిక్షలు విధిస్తారని ఉంది. ప్రజలు తప్పులు చేయకుండా కేవలం భయపెట్టేందుకే మతాలు స్వర్గ, నరకాల ప్రస్తావన చేసినట్లు హేతువాదులు చెప్తారు. కానీ, భూమిపైనే ఆరు నరక నగరాలు ఉన్నాయి. అత్యంత భయంకరమైన, దుర్గమమైన ప్రాంతాలు, మనిషి దగ్గరకు వెళ్లటానికి కలలోనైనా ఊహించలేని ప్రదేశంలో యమ పురులు ఉన్నాయి. వాటి గురించి ఖురాన్, బైబిల్లు కూడా ప్రస్తావించాయి. చర్చించాయి. ఇప్పుడు సైంటిఫిక్ పరిశోధనలు వాటినే గేట్స్ ఆఫ్ హెల్గా నిర్ధారిస్తున్నాయి. స్వర్గం భూమికి పై భాగాన ఉంటుందని, నరకం భూమికి కింద ఉండే లోకాలలో వుంటుందని అన్ని మతాలు చెప్తున్నాయి. అయితే, నరకం ఎక్కడ ఉంటుంది? భూమి కిందకు వెళ్లేదెలా? చనిపోయిన వ్యక్తులు ఏ విధంగా నరకానికి చేరుతారు? భూమి నుంచి నరకానికి వెళ్లేందుకు దారి ఎక్కడినుంచి ఎలా ఉంది? భూమ్మీదే ఆరు చోట్ల నరకానికి దారులున్నాయని ఆధునిక చరిత్రకారులు చెప్తున్నారు. వీటిని గుర్తించారు కూడా. నికరాగువా రాజధానికి కూతవేటు దూరంలో అతి పెద్ద వాల్కెనో.. పేరు మసాయా.

ప్రాణుల్ని గభాలున మింగేసేందుకు ఆబగా తెరుచుకున్న నరకపు నోరు అది.. మైళ్ల కొద్దీ లోతుల్లోంచి ఎగిసి పడే మంటలు.. భయంకరమైన విషవాయువులు.. అంతం ఎక్కడో తెలియనంత డీప్ హోల్.. ఫైర్ లోపల మరేదో ఉంది.. అక్కడ మరేదో తెలియని అండర్ వరల్డ్ యూనివర్స్ ఉంది. లోపలికి వెళ్లడం అంత ఈజీ కాదు. మసాయాకు మరో వైపు నుంచి లోపలికి వెళ్లేందుకు ఓ పెద్ద చీకటి గుహ ఉంది. మసాయా నరకపు ద్వారం. క్రిస్టియన్లు, సుమేరియన్లు, జోరాస్ట్రియన్లు దీన్ని గేట్ ఆఫ్ హెల్గా నమ్ముతారు. రిమోట్ ఏరియాలో రహస్యంగా ఉన్న ఈ గుహ మసాయా వాల్కెనో లోతుల్లోకి దారి చూపుతుంది. కానీ, ఇందులోకి వెళ్లడం ఆషామాషీ కాదు. 1940లలో రాబిన్సన్ అనే ఆర్కియాలజిస్టు దీన్ని ఛేదించే ప్రయత్నంచేసి విఫలమయ్యాడు. అతను ప్రయాణించిన విమానం మసాయా గుహకు సమీపానికి రాగానే ఉన్నట్టుండి ప్రమాదానికి గురైంది. ఒక్కసారిగా మంటలు కమ్ముకున్నాయి. క్షణాల్లోనే తెల్లని పొగ తుపానులా విరుచుకు పడింది. మరు క్షణంలోనే చుట్టూ చీకట్లు అలుముకున్నాయి. ఇది నిజంగా జరిగిన ఘటన. అతని ఎడమవైపు శరీర భాగమంతా కాలిపోయింది. జీవించటానికి అతనికి రెండో అవకాశం లభించింది. బైబిల్ మసాయాను మౌత్ ఆఫ్ హెల్ అని వర్ణించింది. మసాయా నిప్పుల గుండం నుంచే పాపులు నరకానికి వెళ్తారని, ఆ లోపల రకరకాల శిక్షలను అమలు చేస్తారని చెప్పింది. మసాయాకు నాలుగు వందల మైళ్ల దూరంలో సెంట్రల్ అమెరికా పరిధిలో గ్జిబల్బా అనే మరో అగ్ని పర్వతం ఉంది.. దీని గురించిన ప్రస్తావన అన్ని మతాల్లోనూ ఉంది. ఇక్కడికి మనుషులు నీటిలోపలి నుంచి వెళ్లాల్సి ఉంటుంది. దీని లోపల మినీ గుహలు వున్నాయి. కత్తుల గుహ, గబ్బిలాల గుహ, తోడేళ్ల గుహ, మంచు గుహ, అగ్ని గుహ, వీటితో పాటు రక్తనది కూడా ఉంటుంది. ఇదంతా మేయన్ బైబిల్లో లో ఉన్న అంశాలు. గరుడ పురాణంలోనూ నరకం గురించి పేర్కొన్న పదహారు పురాలు ఇలాంటివే. ఇక్కడ ఉన్న ఎరుపు నది హిందూయిజంలో పేర్కొన్న వైతరిణి. అటు బైబిల్లోనూ దీన్ని రక్తనదిగా చెప్పారు. ఏడవ శతాబ్దంలో కొందరు లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించి ప్రాణాలు త్యాగం చేయాల్సి వచ్చింది. గ్జిబల్బా అగ్ని గుహలో చాలా వరకు హ్యూమన్ రిమెయిన్స్ కనిపించాయి. కత్తుల గుహలో 20 ఏళ్ల యువతి అస్తిపంజరం కూడా లభించింది.



అండర్ ది ఎర్త్ అధోలోకాలు ఉంటాయని మన పురాణాలు చెప్తున్నాయి. అన్ని మతాల గ్రంథాలూ ఈ విషయాన్ని ధ్రువీకరించాయి. భూమిపై నుంచే నరకానికి దారులు వున్నాయనటానికి ఈ అగ్ని గుహలే సాక్ష్యంగా నిలుస్తున్నాయని అంటారు. వీటిపై చేసిన రీసర్చ్లో చాలా విషయాలు వెలుగులోకి వచ్చాయి. మత గ్రంథాలలో చెప్పిన కొన్ని అంశాలు.. ఇక్కడ కనిపిస్తున్న దృశ్యాలతో సరిపోలుతున్నాయి. ప్రపంచ ప్రాచీన నాగరికతకు సింబల్గా నిలిచే ఈజిప్టులోని గిజా పిరమిడ్ కాంప్లెక్స్లో మధ్య పిరమిడ్ కింద అండర్ వరల్డ్ ఉందిట. పిరమిడ్పై రాసిన రాతల్లోనూ, వివిధ శాసనాల్లో పిరమిడ్ కింద నరకం ఉందని, అందులో పాపులకు శిక్షలు పడతాయని చెప్తారు. మృత్యువుకు అధిపతి ప్లూటో అని గ్రీకు మైథాలజీ చెప్తోంది. అతనే నరకానికి రాజుగా చెప్తున్నారు. ఈజిప్టు దగ్గర్లో అండర్వరల్డ్ గాడేడ్స్ గుహ ఉంది. ఇందులో మృత్యుదేవత కొలువై ఉంటుందని నమ్మకం. ఇస్లాంలో, జోరాస్ట్రియన్ టెక్ట్స్ కూడా హేడ్స్ గురించి చర్చించారు. నీళ్లలోనుంచి గుహలోకి వెళ్లాల్సి ఉంటుంది. ఇంత భయంకరమైన గుహ ప్రపంచంలో మరెక్కడా కనిపించదు. లోపలికి వెళ్తున్నకొద్దీ వెళ్లటమే తప్ప ముగింపులేని గుహ. దీన్ని కత్తుల గుహ అని కూడా అంటారు. ఇందులోనూ హ్యూమన్ రెలిక్స్ కనిపించాయి. దీని లోతుల్లో మనకు అంతుపట్టని నరక ప్రపంచం ఉందని గ్రీకు మైథాలజీ చెప్తుంది. నరకానికి అయిదో దారి అట్లాంటిక్ ప్రాంతంలో ఐస్లాండ్ మధ్య హెక్లా వాల్కెనో ఉంది.

దట్టమైన చీకట్లో, చుట్టూ మంచు మధ్యలో.. రెండు వేల డిగ్రీల ఉష్ణోగ్రతలో వేడి ఉబికుబికి రావటం హెక్లా బీభత్సానికి నిదర్శనం. దీని తరువాత సేలమ్ అగ్ని పర్వతం మరో నరకం. దట్టమైన అడవి మధ్య ఉన్న ఈ వాల్కెనో లోపల ఉన్నదేమిటో ఇంతవరకు అంతుపట్టలేదు.. వాల్కెనో చుట్టుపక్కలకు వెళ్లటం ఇప్పటి వరకు ఎవరికీ సాధ్యపడలేదు. నరకంలో లక్షలాది శిక్షలు ఉన్నాయని అన్ని మత సిద్ధాంతాలు చెప్తున్నాయి. రక్తకాసారాలు.. క్రిమిభోజనం, అంధకూపం, కుంభీపాకం వంటి కఠిన శిక్షలు అన్ని మైథాలజీలూ చెప్తున్నాయి. నరకానికి మనకు తెలిసిన మార్గాలు ఆరు మాత్రం మనకు దొరికాయి. ఇవి భూమ్మీద ఉన్న నరకాలు. హిందూ ధర్మం చెప్తున్న నరకానికి మాత్రం దారి ఎవరికీ దొరకలేదు. దొరికిన వాళ్లు (చనిపోయాక) ఎలాగూ తిరిగి రాలేరు. మరణం తరువాత ఏమవుతుందో.. ఆత్మ అనేది ఉన్నదో లేదో ఎవరికీ తెలియదు. మరణం తరువాత జీవితం అనేది ఉందా? లేక స్వర్గనరకాలు అన్నీ కల్పితాలేనా? అసలు చావు అంటేనే ఏమిటో ఎలా వస్తుందో ఇంతవరకు తెలియనప్పుడు, ఇక మరణం తరువాత ఏమిటన్నది తెలిసేదెలా? నరకం ఉందో లేదో, యమధర్మరాజు ఎలా ఉంటాడో తెలియదు. మనిషి మంచివాడిగా ఉండేందుకు అతనికి పాప పుణ్యాల భయం పెట్టడం అన్ని మతాలకూ అవసరంగా కనిపించింది. ఈ భయం పెట్టేందుకే స్వర్గం నరకం కాన్సెప్ట్ను తీసుకువచ్చారు. అయితే, ఈ కాన్సెప్టు అతీతంగా, ఈ భూమికి కింద ఏదో ఉన్నదన్నది మాత్రం వాస్తవం.. రిమోట్ ఏరియాలో అగ్ని గుండాలు నరక ద్వారాలని ఆర్కియాలజిస్టులు చెప్తున్నారు.. మైథాలజీని తమ పరిశోధనలకు ఆధారంగా చూపుతున్నారు. వీటి లోతుల్లో ఏమున్నదన్నది ఇప్పటికైతే తెలియకపోయినా, తెలుసుకోవటం అసాధ్యం కాకపోవచ్చు.

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.